
TGTEL/25/A1713
# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను
సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.
సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 24 మే 2026 | వెల : 4/-



## దేశ అభివృద్ధిలో యువతే కీలకం

- ప్రపంచ దేశాలన్నీ భారత్ అభివృద్ధి ప్రయాణంలో భాగం కావాలని కోరుకుంటున్నాయ్
- దేశవ్యాప్తంగా 47 కేంద్రాల్లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళా
- వర్చువల్‌గా 51వేల మందికిపైగా ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ
- భారత్ యువత, టెక్నాలజీ ప్రగతిపై ప్రపంచ దేశాలకు ఆసక్తి పెరిగింది
- రైల్వేలు, బ్యాంకింగ్, రక్షణ, ఆరోగ్యం, విద్య తదితర కీలక రంగాల్లో వారు కొత్త బాధ్యతలు చేపట్టబోతున్నారు
- "ప్రపంచం మొత్తం భారత యువతను చూసి ఎంతో ఆశాభావంతో ఉంది



## యాదగిరిగుట్ట క్షేత్రంలో రూ.99.55 కోట్లతో చేపట్టే పనులకు
# సీఎం శంకుస్థాపన

- యాదగిరిగుట్ట క్షేత్రాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- యాదగిరిగుట్టలో 15 ఎకరాల్లో వేదపాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, శంకుస్థాపన

హైదరాబాద్
తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో సంప్రదాయ వేద విద్యను బోధించే గురుకులం ఏర్పాటవ్వనుంది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయనగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నటువంటి వేద పాఠశాల భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర - మిగతా3లో

## గోదావరి పుష్కరాల పనులకు
# రూ.వెయ్యి కోట్లు



- సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం
- 20 రెగ్యులర్ టీచింగ్, 6 నాన్‌టీచింగ్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన 3 పోస్టుల మంజూరుకు ఆమోదం
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్న అంశాలపై చర్చ

హైదరాబాద్
సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో రెండు గంటలుగా మంత్రివర్గ సమావేశం కొనసాగుతుంది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్న పలు అంశాలపై కేబినెట్ చర్చిస్తోంది. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పాఠశాలల్లో ఈ స్కీమ్ అమల్లో ఉంది. ఇప్పుడు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు కేబినెట్ - మిగతా3లో



## భవ్య పథకం కింద 50 పారిశ్రామిక పార్కులు

- దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్రాలకు 4 నెలల గడువు : కేంద్రం
- తొలిదశలోనే 50 పారిశ్రామిక పార్కులకు అనుమతులు
- వసతుల కల్పనకు ఎకరాకు రూ.1 కోటి
- ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించే పార్కులకు ఎకరాకు రూ.50 లక్షలు
- వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్


## ఫ్యూచర్ సిటీ కాదు.. నీ ఫ్యూచరేంటి హరీష్



- మూసీ ప్రాజెక్ట్‌కు బీఆర్ఎస్ అడ్డంకులు సృష్టిస్తోంది
- మూసీని బాగుచేస్తామంటే అడ్డుపడుతున్నారు
- లగచర్లలో ఇండస్ట్రీస్ పెట్టి యువతకు ఉద్యోగాలిస్తామంటే కుట్ర చేశారు

## భవిష్యత్‌లో యుద్ధాలు కేవల సరిహద్దుకే పరిమితం కావు

- సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్
- భూభాగం, సముద్రం, గగనం, సైబర్, కాగ్నిటివ్ రంగాల్లో ఏకకాలంలో యుద్ధాలు
- కృత్రిమ మేధ, డ్రోన్లు, రోబోటిక్స్ భవిష్యత్ యుద్ధాల రూపురేఖలు మార్చుతున్నాయి
- వేగం, సాంకేతికతే విజయాన్ని నిర్ణయిస్తాయని స్పష్టం



## పీసీసీ మార్పు
# హైకమాండ్ నిర్ణయం



- వార్తలపై మహేష్ గౌడ్ వ్యాఖ్యలు
- 'గాంధీ భవన్‌ను ట్రస్ట్ మెయింటైన్ చేస్తుంది
- ఒక చానెల్ నాపై వార్తలు రాస్తే నమ్మే పరిస్థితి లేదు
- నా పనితీరును కేడర్ అంచనా వేస్తుంది
- నేను ఈ విషయాన్ని చాలా లైట్‌గా తీసుకుంటున్నాను
- 20 నెలలుగా నా పనితీరు ఏంటో మా నేతలకు తెలుసు

హైదరాబాద్
తెలంగాణలో ఒక చానెల్ వార్తలపై టీపీ సీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక చానెల్ తనపై రాస్తు న్న వార్తలను నమ్మే పరిస్థితి లేదన్నారు. పీసీసీ మార్పు అనేది హైకమాండ్ చూసుకుం టుంది. సమయం, సందర్భం వచ్చినప్పుడు అన్ని విషయాలపై మాట్లాడతా నని ఆయన చెప్పుకొచ్చారు. తనపై వస్తున్న వార్తలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తాజాగా స్పందించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. 'గాంధీ భవన్‌ను ట్రస్ట్ మెయింటైన్ చేస్తుంది. ఒక చానెల్ నాపై వార్తలు రాస్తే నమ్మే పరిస్థితి లేదు. నా పనితీరును కేడర్ అంచనా వేస్తుంది. నేను ఈ విషయాన్ని చాలా లైట్‌గా తీసుకుంటున్నాను. 20 నెలలుగా నా పనితీరు ఏంటో మా నేతలకు తెలుసు. నాపై వచ్చిన వార్తలపై నేను స్పందించవద్దని పార్టీ నేతలకు చెప్పాను. - మిగతా3లో



## ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్-అమెరికా కలిసి పనిచేస్తాయి

- నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో-ప్రధాని మోదీతో రూబియో భేటీ
- చర్చలు, దౌత్యం ద్వారా శాంతియుత పరిష్కారానికి భారత్ నిరంతరం మద్దతు ఇస్తుందని

## నిప్పుల కొలిమిని తలపిస్తున్న
# ఉష్ణోగ్రతలు

- వడదెబ్బకు తాజాగా 16 మంది మృత్యువాత
- మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం
- అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు మృతి
- మరణించిన వారి కుటుంబాలకు పరిహారం ప్రకటించిన విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్
వడగాలుల ప్రభావంతో ఏడు జిల్లాల్లో నేడు 16 మంది మృత్యువాత పడ్డట్లు ప్రభుత్వం వెల్లడించింది. నిన్నటి ఎండ తీవ్రత కారణంగా 34 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఎండలు, వడగాలుల తీవ్రత నేపథ్యంలో - మిగతా3లో

# దేశ అభివృద్ధిలో యువతే కీలకం

దేశంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళాలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ శనివారం 51 వేల మందికి పైగా యువతకు ఉద్యోగ నియామక పత్రాలను వర్చువల్‌గా పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని యువతను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా నియామక పత్రాలు అందుకున్న యువతకు ప్రధాని అభినందనలు తెలిపారు. రైల్వేలు, బ్యాంకింగ్, రక్షణ, ఆరోగ్యం, విద్య తదితర కీలక రంగాల్లో వారు కొత్త బాధ్యతలు చేపట్టబోతున్నారని చెప్పారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత కీలక భాగస్వాములుగా మారబోతున్నారని పేర్కొన్నారు. “ఈ రోజు దేశవ్యాప్తంగా వేలాది మంది యువతకు ఎంతో ముఖ్యమైన రోజు. 51 వేల మందికి పైగా యువకులు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. రాబోయే రోజుల్లో వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మీ పాత్ర ఎంతో కీలకం. ఈ విజయానికి మీ కుటుంబ సభ్యులను కూడా హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను” అని ప్రధాని మోదీ అన్నారు.

దేశ యువత సామర్థ్యంపై ప్రపంచ దేశాలకు విశేష నమ్మకం ఏర్పడిందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఇటీవల తాను ఐదు దేశాల పర్యటన పూర్తి చేసుకుని వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ దేశాల్లో రాజకీయ నాయకులు, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో జరిగిన సమావేశాల్లో భారత్‌పై ఉన్న విశ్వాసం స్పష్టంగా కనిపించిందన్నారు. “ప్రపంచం మొత్తం భారత యువతను చూసి ఎంతో ఆశాభావంతో ఉంది. భారతదేశ సాంకేతిక ప్రగతి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ రోజు ప్రపంచ దేశాలన్నీ భారత్ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాయి. భారత యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు రావాలన్నదే మా లక్ష్యం” అని ప్రధాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత్‌లో పెరుగుతున్న సాంకేతిక భాగస్వామ్యాలను ప్రధాని వివరించారు. నెదర్లాండ్స్‌కు చెందిన ప్రముఖ సెమీకండక్టర్ సంస్థ ాసాబీతో భారత టాటా గ్రూప్ ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇది అత్యంత అరుదైన భాగస్వామ్యమని, దీని ద్వారా దేశంలో భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు.




అలాగే తదుపరి తరం సాంకేతిక పరిజ్ఞానానికి భారత్‌కు ద్వారాలు తెరుచుకుంటాయని అభిప్రాయపడ్డారు. స్వీడన్‌తో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో భాగస్వామ్యాలు కుదిరాయని, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో సూపర్ కంప్యూటింగ్ రంగంలో సహకారం పెరుగుతోందని తెలిపారు. ఈ ఒప్పందాలన్నీ యువతకు కొత్త అవకాశాలను తీసుకురాబోతున్నాయని ప్రధాని అన్నారు.

అదేవిధంగా గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, క్రిటికల్ మినరల్స్, సస్టైనబుల్ మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో భారత్ వేగంగా ముందుకు సాగుతోందని చెప్పారు. స్వీడన్, నార్వే, ఇటలీ వంటి దేశాలతో గ్రీన్ ట్రాన్సిషన్, సస్టైనబుల్ టెక్నాలజీ రంగాల్లో భాగస్వామ్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. యూఏఈ, నార్వేతో కుదురుతున్న ఒప్పందాలు భారత్ షిప్‌బిల్డింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ ఉపాధి కల్పన లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువతకు పారదర్శకంగా, వేగంగా ప్రభుత్వ ఉద్యోగాలు అందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందన్నారు.

రోజ్‌గార్ మేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 18 విడతలుగా కార్యక్రమాలు నిర్వహించగా, సుమారు 12 లక్షల మందికి పైగా యువతకు నియామక పత్రాలు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈసారి ఎంపికైన అభ్యర్థులు రైల్వే, హోం వ్యవహారాలు, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, ఆర్థిక సేవలు, ఉన్నత విద్యా శాఖలతో పాటు పలు కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో చేరనున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల యువతను ప్రధానంగా లక్ష్యంగా చేసుకుని రోజ్‌గార్ మేళాలను నిర్వహిస్తున్నారు. 8వ తరగతి, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అర్హతలున్న అభ్యర్థులతో పాటు నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ కింద శిక్షణ పొందిన వారికి కూడా అవకాశాలు కల్పిస్తున్నారు. దేశ యువత శక్తి, నైపుణ్యాలే భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెడతాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. యువతకు మరిన్ని అవకాశాలు, ప్రపంచ స్థాయి పరిజ్ఞానం, ఆధునిక రంగాల్లో ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# భవిష్యత్‌లో యుద్ధాలు కేవల సరిహద్దుకే పరిమితం కావు

భవిష్యత్ యుద్ధాలు సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా మల్టీ-డొమైన్ విధానంలో జరుగుతాయని భారత సాయుధ దళాల చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్? అనిల్? చౌహాన్? వ్యాఖ్యానించారు. భూభాగం, సముద్రం, గగనం మాత్రమే కాకుండా సైబర్, కాగ్నిటివ్ వార్‌ఫేర్ వంటి రంగాలు కూడా యుద్ధాల్లో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక యుద్ధాలు ఇకపై కేవలం సైనిక బలం, సంప్రదాయ ఆయుధాలు లేదా ప్లాట్‌ఫామ్ ఆధారిత ఆపరేషన్లతో మాత్రమే పరిమితం కావని స్పష్టం చేశారు. శనివారం మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాలో ఒక రక్షణ తయారీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ అనిల్ చౌహాన్ ఈమేరకు వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధ (ఏఐ), డ్రోన్లు, రోబోటిక్స్, సైబర్ సిస్టమ్స్, ఆటోనమస్ ప్లాట్‌ఫామ్స్, అంతరిక్ష సాంకేతికతలు భవిష్యత్ యుద్ధాలకు నిర్ణయాత్మక రూపం ఇస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో సాంకేతికత, వేగం, ఆవిష్కరణలే విజయవంతమైన సైనిక ఆపరేషన్లను నిర్ణయిస్తాయని సీడీఎస్ తెలిపారు.

భవిష్యత్‌లో యుద్ధభూములు కేవలం భౌగోళిక ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావని, సమాచార నెట్‌వర్క్‌లు, డిజిటల్ ఎకోసిస్టమ్‌లు, సైబర్ మౌలిక వసతులు కూడా యుద్ధరంగాలుగా మారతాయని ఆయన హెచ్చరించారు. ఏ దేశం వేగంగా సాంకేతిక ఆవిష్కరణలు చేస్తుందో, రక్షణ ఉత్పత్తిని త్వరగా పెంచుతుందో, అలాగే తమ సాయుధ దళాలను కొత్త పరిస్థితులకు వేగంగా అనుగుణంగా మార్చుకుంటుందో ఆ దేశానికే వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తుందని జనరల్ చౌహాన్ అన్నారు.



**వారిదే భవిష్యత్తు**

విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు కేంద్రంగా పేరుగాంచిన షిర్డీ, నేడు రక్షణ రంగ తయారీ, సాంకేతిక ఆవిష్కరణలు, జాతీయ భద్రతకు కేంద్రంగా ఆవిర్భవించనుందని సీడీఎస్? జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలన్న? లక్ష్యం దిశగా ఎన్ఐబీఈ షిర్డీ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్ ముందడుగు వేయనుందని తెలిపారు. ‘విక?సిత్ భారత్’ నిర్మాణానికి ఇంజినీరింగ్ విద్యార్థులను, యువ ఆవిష్కర్తలు ముందుకు రావాలని చౌహాన్? కోరారు. “మార్పును సృష్టించే వారిదే భవిష్యత్తు. మీరే భారతదేశపు శక్తి. మీరే వికసిత్? భారత్ రూపశిల్పులు. ఎప్పుడూ ఒకటి గుర్తుంచుకోండి, సరైన మార్గంలో పయనించడం వల్ల తాత్కాలిక ఎదురుదెబ్బలు, కొన్ని ఒడిదుడుకులు ఎదురుకావచ్చు. కానీ అవన్నీ జీవితంలో సహజమే. దారిలో వచ్చే మలుపు, ఆ దారికి అంతం కాదు” అని ఆయన అన్నారు.

**ప్రైవేట్ రక్షణ రంగ విశ్వాసానికి నిబే గ్రూప్ ఒక ఉదాహరణ**

ఇదిలా ఉండగా, రక్షణ ఉత్పత్తిలో భారత్ సాధించిన పురోగతిని హైలైట్ చేస్తూ, దేశీయ రక్షణ తయారీ దాదాపు రూ. 1.27 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరుకుందని సీడీఎస్ పేర్కొన్నారు. అలాగే, రక్షణ ఎగుమతులు రూ. 38,000 కోట్లు దాటాయని, భారత రక్షణ ఉత్పత్తులు ఇప్పుడు 100కు పైగా దేశాలకు చేరుతున్నాయని ఆయన తెలిపారు. క్షిపణి వ్యవస్థలు, మందుగుండు సామగ్రి, స్వయంప్రతిపత్తి గల ప్లాట్‌ఫారమ్‌లు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలో ‘నిబే గ్రూప్?’ చేస్తున్న కృషిని ఆయన ఉదహరించారు. భారత ప్రైవేట్ రక్షణ రంగంపై పెరుగుతున్న విశ్వాసానికి నిబే గ్రూప్? ఒక అద్భుతమైన ఉదాహరణ అని అభివర్ణించారు.

మరోవైపు, ఏ దేశానికైనా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యం అవసరమని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్?డీఓ) ఛైర్మన్ సతీశ్? కామత్ అన్నారు. ఐదు లక్షల 155 ఎంఎం ఆర్టిలరీ షెల్స్‌ను ఉత్పత్తి చేసే ఇలాంటి ప్లాంట్ దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడంలో దోహదపడుతుందని కామత్ అభిప్రాయపడ్డారు. ఈ సదుపాయం, అత్యంత కీలకమైన రంగంలో దేశాన్ని ‘ఆత్మనిర్భర్’ (స్వయం సమృద్ధి)గా మార్చడంలో సాయపడుతుందని తెలిపారు. ఇక, షిర్డీలోని నిబే రక్షణ ఉత్పత్తి సముదాయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా హాజరయ్యారు .

# చిన్నపిల్లల మిస్సింగ్ కేసులపై సుప్రీంకోర్టు ఆందోళన

దేశవ్యాప్తంగా పెరుగుతున్న చిన్నపిల్లల అదృశ్యం కేసులను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు, వాటిని కిడ్నాప్? కేసులుగా నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తప్పిపోయిన పిల్లలను గుర్తించడంలో ఉన్న వ్యవస్థాగత వైఫల్యాలను సరిదిద్దడానికి, అక్రమ రవాణా (ట్రాఫికింగ్) నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ ఆదేశాలు ఇచ్చింది. 2011లో తమిళనాడులో కుమార్తెను పోగొట్టుకున్న ఓ వ్యక్తి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వాజ్యంపై జస్టిస్ అసహనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా, నిరంతరం పెరుగుతున్న పిల్లల అదృశ్యం కేసులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్? అమానుల్లా మాట్లాడుతూ, “ చిన్న పిల్లల మిస్సింగ్ కేసుల్లో చాలా పెద్ద వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రస్తుతం దాదాపు 47వేల మంది పిల్లలు ట్రేస్ కాకుండా మిగిలిపోయారు. గతేడాది ఈ సంఖ్య దాదాపు 10వేల మంది ఉండవచ్చు. ప్రతి సంవత్సరం ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతూనే ఉంది” అని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పిపోయిన పిల్లలు తరచుగా వ్యవస్థీకృత అంతర్-రాష్ట్ర అక్రమ రవాణా ముఠాల (సిండికేట్స్) బారిన పడుతున్నారనే క్షేత్రస్థాయి వాస్తవానికి సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. పోలీస్ యంత్రాంగం నిర్వహిస్తున్న ‘క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్’ డేటాబేస్, ఛైల్డ్ వెల్ఫేర్ అధికారులు నిర్వహిస్తున్న ‘విశాల్ వాత్సల్య’ డేటాబేస్ మధ్య సరైన సమన్వయం, ఏకీకరణ లేకపోవడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో పిల్లల మిస్సింగ్ సమస్యను పరిష్కరించడానికి సర్వోన్నత న్యాయస్థానం తాత్కాలికంగా 5 కీలక ఆదేశాలను జారీ చేసింది. వివిధ సంస్థలు నిర్వహిస్తున్న డేటాబేస్?లను ఏకీకృతం చేయాలి. తద్వారా పోలీసులు, ఛైల్డ్? వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల రక్షణ విభాగాలు, బాలల సంరక్షణ కేంద్రాల మధ్య సమాచారం (రియల్-టైమ్) తక్షణమే బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. జిల్లాలో యాంటీ హ్యూమన్? ట్రాఫికింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినప్పటికీ, అవి పనిచేయడం లేదని లేదా కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఏహెచ్?టీయూలను తగిన అధికారాలు, అవసరమైన మౌలిక సదుపాయాలతో నాలుగు వారాల్లోపు పూర్తి స్థాయిలో పనిచేసేలా చేయాలని ఆదేశించింది ఒక బిడ్డ అదృశ్యమైనప్పుడు, అధికారులు దానిని ముందుగానే కిడ్నాప్? లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి కేసులను కిడ్నాప్? నిబంధనల కింద నమోదు చేయడం వల్ల దర్యాప్తులో సీరియస్?నెస్? పెరుగుతుందని, విధానపరమైన అస్పష్టత వల్ల జరిగే ఆలస్యాన్ని నివారించవచ్చని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. పరిస్థితులు మానవ అక్రమ రవాణా లేదా వ్యవస్థీకృత నేర ముఠాల ప్రమేయాన్ని సూచిస్తున్నట్లయితే, దర్యాప్తు సంస్థలు ఆ కేసులను యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లకు బదిలీ చేయడానికి నాలుగు నెలలపాటు వేచి చూడకూడదని కోర్టు స్పష్టం చేసింది. రక్షించిన పిల్లలను సాధారణంగా 24 గంటల్లోపు వారి కుటుంబాలకు అప్పగించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఒకవేళ ఆ కుటుంబానికే అక్రమ రవాణా లేదా వేధింపులతో సంబంధం ఉందని ఆధారాలు ఉంటే, అప్పుడు ఆ పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీలే చూసుకోవాలని పేర్కొంది.

రక్షించిన ప్రతి బిడ్డకు ఆధార్? నమోదు, ధ్రువీకరణ (వెరిఫికేషన్) జరగాలని, దీని వల్ల నకిలీలను నిరోధించడానికి వీలవుతుందని కోర్టు పేర్కొంది. పిల్లల ఆధార్?, పర్యవేక్షణను నిర్ధరించడానికి జిల్లా బాలల రక్షణ విభాగాలు (డీసీపీయూ) చురుగ్గా సమన్వయం చేసుకోవాలని ఆదేశించింది. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతుందని, దేశవ్యాప్తంగా అధికారులు ఈ ఆదేశాలను ఎంత వరకు అమలు చేశారో పరిశీలించిన తర్వాత తదుపరి ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను 2026 ఆగస్టుకు వాయిదా వేసింది. 2011 సెప్టెంబర్? 19న చెన్నైలో తన కుమార్తె అదృశ్యం కావడంతో జి.గణేశ్? అనే వ్యక్తి మద్రాస్? హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్? దాఖలు చేశారు. ఆ రోజే విరుగాంబాక్కం పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేయగా, ఎఫ్?ఐఆర్ నమోదు అయ్యింది. కానీ స్థానిక పోలీసులు, ఆ తర్వాత సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్? దర్యాప్తు చేసినప్పటికీ ఆ చిన్నారి ఆచూకీ లభించలేదు. చివరకు పోలీసులు ఈ కేసును ‘అన్?డిటక్టబుల్’? (గుర్తించలేనిది)గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ సమర్పించారు. ఆ తర్వాత తండ్రి దాఖలు చేసిన ప్రొటెస్ట్ పిటిషన్?ను కొట్టివేశారు. మద్రాస్ హైకోర్టు కూడా 2025 మార్చిలో ఇందులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. దీనితో బాధిత తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ కేసులో అధికారులు, మద్రాస్ హైకోర్టు అనుసరించిన విధానంపై అభ్యంతరం వ్యక్తం చేసింది.

## ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్-అమెరికా కలిసి పనిచేస్తాయి

ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్- అమెరికా నిరంతరం కలిసి పనిచేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో నాలుగు రోజుల భారత పర్యటన నిమిత్తం శనివారం దిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో రక్షణ, వాణిజ్యం, ఇంధనం వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై ప్రధాని మోదీ విస్తృత చర్చలు జరిపారు. అలాగే, పశ్చిమాసియాలోని పరిస్థితిపై వాషింగ్టన్ దృక్పథాన్ని రూబియో మోదీకి వివరించారు. అయితే, చర్చలు, దౌత్యం ద్వారా శాంతియుత పరిష్కారానికి భారత్ నిరంతరం మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. రక్షణ, వ్యూహాత్మక సాంకేతికతలు, వాణిజ్యం పెట్టుబడి, ఇంధన భద్రత, విద్య, ప్రజల మధ్య సంబంధాలతో సహా అనేక రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన నిరంతర పురోగతి గురించి రూబియో ప్రధానికి వివరించారు. అంతకుముందు కోల్‌కతాలోని మిషనరీస్ ఆఫ్ ఛారిటీకి చెందిన మదర్ థెరిసా హౌస్‌ను రూబియో సందర్శించారు. అనంతరం దిల్లీకి వెళ్లిన ఆయన మోదీతో భేటీ అయ్యారు. ఆదివారం విదేశాంగ మంత్రి ఎస్? జైశంకర్ తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈనెల 25న ఆగ్రా, జైపుర్ నగరాలను సందర్శించనున్న రూబియో 26న దిల్లీలో జరిగే క్వాడ్ కూటమి విదేశాంగమంత్రుల సమావేశంలో పాల్గొనున్నారు.

## భవ్య పథకం కింద 50 పారిశ్రామిక పార్కులు



భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకం కింద 50 పారిశ్రామిక పార్కుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్రాలకు 4 నెలల గడువు ఇచ్చామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. శనివారం (మే 23) నుంచి రానున్న నాలుగు నెలల్లోగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు దరఖాస్తులను సమర్పించొచ్చన్నారు. ఇందులోని 20 పారిశ్రామిక పార్కులకు తొలి రెండు నెలల్లో, మిగతా 30 పారిశ్రామిక పార్కులకు తదుపరి రెండు నెలల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. భవ్య పథకం తొలిదశలోనే ఈ మొత్తం 50 పారిశ్రామిక పార్కులకు అనుమతులను మంజూరు చేస్తామని, మిగతా 50 పార్కులకు తదుపరి దశలో అనుమతులు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటురంగ కంపెనీల సంయుక్త భాగస్వామ్యంతో ఈ స్కీం అమలవుతుందని పీయూష్ గోయల్ చెప్పారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈవివరాలను ఆయన చెప్పారు.

**నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్రాల మధ్య పోటీ**

భవ్య స్కీంలో భాగంగా 100 నుంచి 1000 ఎకరాల్లో ఉండే పారిశ్రామిక పార్కులను అభివృద్ధి కోసం చేపడతామని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దీనికి ఎంపికయ్యే పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎకరాకు రూ.1 కోటి చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. పర్వత ప్రాంతాలు ఎక్కువగా ఉండే రాష్ట్రాల్లో 25 ఎకరాల్లో ఉండే పారిశ్రామిక పార్కులనూ భవ్య స్కీంకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ పథకానికి కేంద్రం కేటాయించిన రూ.33,660 కోట్ల నిధులను, వీటితో ముడిపడిన ప్రాజెక్టులను దక్కించుకోవడానికి రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడతాయని పీయూష్ గోయల్ అన్నారు. భూమి, నీరు, విద్యుత్ వంటి మెరుగైన సౌకర్యాలను కల్పించే రాష్ట్రాలే పెట్టుబడిదారులను ఆకర్షించే అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. రాజస్థాన్, మహారాష్ట్ర, బంగాల్, హరియాణా వంటి రాష్ట్రాలు భవ్య స్కీంపై తీవ్ర ఆసక్తిని చూపుతున్నాయన్నారు.

**ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులకు ఎకరాకు రూ.50 లక్షలు**

“రాష్ట్రాలు, ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకొని ప్రతిపాదనలను సమర్పించేందుకు అనుమతించే ఒక నిబంధన కూడా భవ్య పథకంలో ఉంది. ఇలాంటి సందర్భాల్లో భవ్య పథకానికి ఏదైనా ప్రాజెక్టు ఎంపికైతే, ఎకరాకు రూ. 50 లక్షలు చొప్పున ఆర్థిక సహాయాన్ని కేంద్ర సర్కారు అందిస్తుంది. రాష్ట్రాలు తమ దరఖాస్తులకు వేగవంతమైన ఆమోదం లభించేలా చూసేందుకు ఒక స్పెషల్ పర్పజ్ వెహికల్ (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేసి, ఒక ప్లానింగ్ అథారిటీని నియమించాలి. సింగిల్ విండో క్లియరెన్స్ యంత్రాంగాన్ని కూడా స్థాపించాలి.రానున్న మూడేళ్లలో ఈ 50 పారిశ్రామిక పార్కులు కార్యరూపం దాలుస్తాయని మేం ఆశిస్తున్నాం” అని పీయూష్ గోయల్ తెలిపారు.

**ఏమిటీ భవ్య పథకం?**

పరిశ్రమలు పెట్టాలనుకునే కంపెనీలకు సకల వసతులతో కూడిన పారిశ్రామిక ప్రాంతాలను అందించడమే భవ్య పథకం లక్ష్యం. కంపెనీ లేదా ఇన్వెస్టర్ కేవలం తమ యంత్రాలను తెచ్చుకుని, ఇక్కడ వెంటనే ఉత్పత్తిని ప్రారంభించుకోవచ్చు. రోడ్లు, నిరంతర విద్యుత్, నీటి సరఫరా, ఇంటర్నెట్ కనెక్టివిటీ, గిడ్డంగులు, కార్మికుల వసతి గృహాలు వంటివన్నీ ఈ పారిశ్రామిక పార్కుల్లో ముందే నిర్మించి ఉంటాయి. పర్యావరణ, స్థల అనుమతులు ముందే లభిస్తాయి. ఈ పథకం క్లస్టర్ ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. పరిశ్రమలు, సరఫరాదారులు, సేవా ప్రదాతలను ఒకేచోటకు చేరుస్తుంది. తద్వారా దేశీయ సరఫరా గొలుసులను బలోపేతం చేస్తుంది. ప్రాంతీయ పారిశ్రామికీకరణను ప్రోత్సహిస్తుంది. లక్షలాది మందికి కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. భవ్య పథకం తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, తక్షణమే వినియోగించగల పారిశ్రామిక మౌలిక సదుపాయాలను కోరుకునే ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది.

**15 లక్షల ఉద్యోగ అవకాశాలు**

రూ.33,660 కోట్ల భారీ బడ్జెట్‌తో రాబోయే 6 ఏళ్లలో (2026-27 నుంచి 2031-32 వరకు) భవ్య పథకాన్ని అమలు చేస్తారు. దేశవ్యాప్తంగా మొత్తం 100 అత్యాధునిక ఇండస్ట్రియల్ పార్కులను నిర్మిస్తారు. ప్రస్తుతం మొదటి 50 పార్కుల కోసం రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలను కేంద్రం ఆహ్వానిస్తోంది. ఈ పథకం అమలుతో దేశంలో ప్రత్యక్షంగా దాదాపు 15 లక్షల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా.

## పోలీస్‌గా నమ్మించి.. 21 మంది మహిళలను మోసం చేసిన వ్యక్తి

**అహ్మదాబాద్:** నకిలీ ఫొటోలు, డాక్యుమెంట్లతో పోలీస్ అధికారిగా ఒక వ్యక్తి నమ్మించాడు. సుమారు 21 మంది మహిళలను మోసం చేశాడు. వారి నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు. కొందరు మహిళల ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. (ఝఅ జూశీంవం ఖం ఎశీజూ ఎబజూవం 21 షశీఎవఅ) గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. హిమాంశు అలియాస్ రాకీ పంచల్ పలు మ్యాట్రిమోనియల్, డేటింగ్ ప్లాట్‌ఫామ్‌లలో రిజిస్టర్ అయ్యాడు. ఏఐ టూల్స్ సహాయంతో నకిలీ పత్రాలు, ఐడీ కార్డులు సృష్టించాడు. గుజరాత్ పోలీస్ సైబర్‌క్రైమ్ విభాగానికి చెందిన ఎస్ఐగా పలువురు మహిళలను నమ్మించాడు. ఆర్థిక ఇబ్బందులు, విధుల నుంచి సస్పెన్షన్, ఐటీ రైడ్స్‌లో బ్యాంకు ఖాతాల ఫ్రీజ్ వంటి అసత్యాలు చెప్పి, నకిలీ లేఖలు చూపించి సుమారు 21 మంది మహిళల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశాడు. కాగా, అహ్మదాబాద్‌లోని నరోడా, నవరంగ్‌పురా ప్రాంతాలకు చెందిన మహిళలకు రాకీపై అనుమానం కలిగింది. వారిద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేయగా అతడి వ్యవహారం బయటపడింది. గుజరాత్‌తో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలో కూడా పలువురు మహిళలను అతడు మోసం చేసినట్లు పోలీసులు తెలుసుకున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నివసిస్తున్న అతడ్ని అరెస్ట్ చేశారు. మరోవైపు ముంబై సమీపంలోని నలసోపారా పోలీస్ స్టేషన్‌లో రాకీపై గతంలో ఒక అత్యాచారం కేసు నమోదైందని పోలీస్ అధికారి తెలిపారు. బెయిల్‌పై విడుదలైన అతడు మహిళలను లక్ష్యంగా చేసుకోవడాన్ని కొనసాగించాడని చెప్పారు. బెయిల్ ఖర్చుల పేరుతో అహ్మదాబాద్‌లోని నవ వడజ్ ప్రాంతానికి చెందిన మహిళ నుంచి రూ.50,000 తీసుకున్నట్లు తెలిసిందన్నారు. నరోడాకు చెందిన మరో మహిళ నుంచి రూ. 1.8 లక్షలు, నవరంగ్‌పురా మహిళను రూ. 80,000కు మోసగించాడని వివరించారు. ఇతర బాధిత మహిళలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# యాదగిరిగుట్ట క్షేత్రంలో రూ.99.55 కోట్లతో చేపట్టే పనులకు సీఎం శంకుస్థాపన


-మొదటిపేజీ తరువాయి

విజయేంద్ర సరస్వతీ స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. మొత్తంగా రూ.100 కోట్లతో చేపట్టే పనులకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

వచ్చే రెండేళ్లలో వేదపాఠశాల నిర్మాణం పూర్తిచేసి తరగతులు ప్రారంభించనున్నారు. దీంతో పాటు మెట్లమార్గానికి పైకప్పు, మాడ వీధులకు మెట్లు, దీక్షాపరుల మండలం పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. సీఎం పర్యటన సందర్భంగా అధికారులు పకడ్బందీ ఏర్పాటు చేశారు.

**జగద్గురు సమక్షంలో వేద పాఠశాలకు భూమిపూజ**

యాదగిరిగుట్ట వెళ్లిన ముఖ్యమంత్రి రేంత్ రెడ్డి 100 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో యాదగిరి గుట్టకు వెళ్లిన సీఎం ముందుగా కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం జగద్గురు పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛరణల నడుమ వేద పాఠశాలకు శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. వేదపాఠశాలను రూ.43 కోట్ల వ్యయంతో 15 ఎకరాల్లో నిర్మించనున్నారు. ఇందులో 300 మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసించే విధంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. వేద పాఠశాలలో విద్యార్థులకు ఉచిత బోధనతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నారు. అత్యాధునికి గోశాలతో పాటు యజ్ఞశాల, యాగశాలలు సైతం నిర్మించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న వేదపాఠశాలలో కంచి కామకోటి పీఠం పర్యవేక్షణలో బోధన చేపట్టనున్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదంతోపాటు ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేసేందుకు వీలు కల్పించి



విద్యార్థులకు పట్టాలు అందించనున్నారు.

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన**

యాదగిరిగుట్ట ఆలయానికి సంబంధించిన అనుబంధ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. 9 కోట్ల 86 లక్షలతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం, కోటి 41 లక్షలతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పైకప్పు నిర్మాణం, కోటి 34 లక్షలతోతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణంతోపాటు డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణాలకు రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అనంతరం టెంపుల్ సిటీ నుంచి ఆలయ కొండపైకి వెళ్లి లక్ష్మీనరసింహ స్వామి వారిని సీఎం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు.

కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు : దర్శనం తర్వాత సీఎం హైదరాబాద్‌కు వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కఠిన సవాళ్లను అధిగమిస్తేనే భవిష్యత్‌లోని సవాళ్లు ఎదుర్కోగలం

గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఏలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మారుతున్న కాలంలో సంక్లిష్టమైన పన్ను నిబంధనలు, జీఎస్టీ వ్యవస్థ, వ్యాపారాల విస్తృతి నేపథ్యంలో దేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేయడంలో సీఏల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

**సలహాదారులుగా ఎదగాలి**

సమాజంలో పారదర్శకతను పెంచే బాధ్యత వీరిపైనే ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. సీఏ కోర్సులోని కఠినత్వాన్ని, ఆ ఒత్తిడిని అధిగమించి విజయం సాధించిన ప్రతి విద్యార్థి, భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి సవాలునైనా ధైర్యంగా ఎదుర్కోగల శక్తిమంతులని అభినందించారు. సీఏలు కేవలం అకౌంటింగ్ లేదా పన్నులకే పరిమితం కాకుండా, వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వ్యాపార సంస్థలు బలోపేతం అయినప్పుడే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, తద్వారా సామాన్య ప్రజల సంక్షేమానికి మార్గం సుగమం అవుతుందని ఆయన వివరించారు.

**పని సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చు**

మారుతున్న ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఏఐ)



వంటి అత్యాధునిక సాంకేతికతలను వృత్తిలో భాగంగా చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా పని సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని ఉద్ఘాటించారు. ఈ స్థాయికి చేరుకోవడంలో విద్యార్థుల వెనుక ఉన్న తల్లిదండ్రుల అపారమైన త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని, వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లు సీఏ శ్రీధర్ ముప్పాళ్ల సీఏ దాయనివాస్ శర్మ ఐసీఏఐ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎంల వద్ద సరికొత్త మోసాలు

కన్నం వేసేవాడు ఒకడైతే, కాపలా కాసేవాడు మరొకడు అన్నట్లు బ్యాంక్ ఖాతాలో డబ్బులు ఉంటాయి. ఏటీఎంకు వెళ్లి పిన్ ఎంటర్ చేయగానే మెషిన్?లో డబ్బులు లెక్కించిన సౌండ్ వస్తుంది. కానీ క్యాష్ మాత్రం బయటకు రాదు. సర్వర్ ప్రాబ్లమ్ వల్లనో లేదా ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయ్యిందనో కస్టమర్లు వెనుదిరిగిపోతారు. కానీ అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. కస్టమర్ వెళ్లగానే ఏటీఎంలోకి వేరే వ్యక్తులు ప్రత్యక్షమవుతారు. క్షణాల్లో కస్టమర్ విత్ డ్రా చేసిన డబ్బులు తీసుకుని మాయం అవుతారు. అసలు కస్టమర్ విత్ డ్రా చేసిన డబ్బులను వాళ్లేలా కాజేస్తున్నారు? డ్రా అయ్యాక అవి ఎక్కడికి పోతున్నాయి? బ్యాంకు అధికారుల కన్నుగప్పి ఏటీఎం మోసాలకు పాల్పడుతున్న ఆ అంతర్రాష్ట్ర ముఠాల గురించి ఈ పూర్తి కథనంలో చూద్దాం! హైదరాబాద్ మహా నగరంలో ఏటీఎం చోరీలు రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. టెక్నాలజీ పెరిగే కొద్దీ బ్యాంకులకు కన్నం వేసేందుకు అంతర్రాష్ట్ర ముఠాలు సరికొత్త పద్ధతులను ఎంచుకుంటున్నారు. మొన్నటి వరకు ఏటీఎంల వద్ద పవర్ కట్ చేశారు. డిపాజిట్ మెషిన్లలో చేతులు పెట్టి రూ.లక్షలు కొల్లగొట్టారు. మరికొందరైతే ఏకంగా ఏటీఎం మెషిన్‌నే ఎత్తుకెళ్లారు. వీటన్నింటికీ భిన్నంగా ఇప్పుడు మరో కొత్త చోరీ ముందుకొచ్చింది. ఏకంగా ఏటీఎం క్యాష్ స్లాట్‌కే ఫైబర్ ప్లేట్లు అమర్చి, ఖాతాదారుల నగదుకు పెద్ద గండిపెడుతున్నారు.

**ఏటీఎం వద్ద సరికొత్త మోసం**

అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడైనా డబ్బులు డ్రా చేసుకోడానికి ఏటీఎం మెషిన్ ఉపయోగపడుతుంది. లిక్విడ్ క్యాష్ కంటే డెబిట్ కార్డ్ నయం కదా అనుకుంటారు. కానీ కస్టమర్లు, వృద్ధుల వీక్ నెస్‌లను అవకాశంగా మలచుకొని కొందరు డబ్బులు దండుకుంటున్నారు. తాజాగా జూబ్లీహిల్స్ పరిధిలోని ఎస్బీఐ ఏటీఎంలో ఇద్దరు దుండగులు అలాంటి సరికొత్త మోసానికి తెరతీశారు. ఓ వ్యక్తి దగ్గర నుంచి రూ.48 వేల నగదును కాజేశారు. ఖాతాలో నుంచి నగదు డెబిట్ అయినప్పటికి, ఏటీఎం నుంచి డబ్బు బయటకు రాకపోవడంతో కస్టమర్లు బ్యాంకును ఆశ్రయించారు. దీంతో సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన ఎస్బీఐ అధికారులు, ఫైబర్ ప్లేట్ గ్యాంగ్ బాగోతాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు రిటైర్డ్ డీసీపీ చెబుతున్నారు.

"పైన తాత్కాలికంగా రీనర్ పెట్టి కార్డు నంబర్‌తో సహా మొత్తం వివరాలు తీసుకుంటారు. ఆ ఖాతాదారులు వెళ్లిపోయిన తర్వాత రాత్రి పూట వచ్చి ఆ కార్డును క్లోనింగ్? చేస్తారు. క్లోన్ చేసి ఇన్సర్ట్ చేసి వివరాలన్నీ అందులో నమోదు చేసి ఖాతా నుంచి డబ్బులు కాజేస్తారు. ఏటీఎం లోపలికి వెళ్లేటప్పుడు మీ పిన్ కార్డు జాగ్రత్తగా పెట్టుకోవాలి"

**ఫైబర్ ప్లేట్లనే మార్చుతున్న దుండగులు**

దొంగతనంలో ఒక్కొక్కరిది ఒక్కో స్టైలూ. కొందరు దొంగలు ఏటీఎంనే ఎత్తుకెళ్లుతుంటే, మరికొందరు వెనకాలే ఉండి డ్రా చేసిన డబ్బులు లాక్కెళుతున్నారు. ఇంకొందరైతే అనుమానం రాకుండా ఫైబర్ ప్లేట్లనే అమర్చుతున్నారు. ఇదంతా ఒకెత్తైతే, టెక్నాలజీని వాడుకొని ఆశ్చర్యపోయే దొంగాలోచనలు చేస్తున్నారు. కొన్ని ఏటీఎంలలో తల ఉపరితల భాగాన సీక్రెట్ కెమెరా పెడతారు. కస్టమర్ ఏటీఎంలో డబ్బులు డ్రా చేస్తున్నప్పుడు కార్డు డీటేయిల్స్, పిన్ నెంబర్ లాంటివి అన్ని రికార్డు చేసుకుంటారు. అది కాస్త సాయంత్రం అయ్యాక టెక్నాలజీని ఉపయోగించి క్లోనింగ్ పద్ధతి ద్వారా నకిలీ చిప్ తయారు చేస్తారు. దాంతో కావాల్సినంత డబ్బును బాధితుల అకౌంట్ల నుంచి డ్రా చేసుకుంటారు.

**డ్రా చేస్తున్న సమయానికి ఏటీఎం స్విచ్ ఆఫ్**

నగరంలో ఉన్న ఏటీఎంలను టార్గెట్ చేయడం నేరగాళ్లకు ఇది కొత్తేమీ కాదు. గతంలో టెక్నాలజీలోని చిన్న చిన్న లోపాలను ఆసరాగా చేసుకుని రూ.లక్షలు కొల్లగొట్టారు. కస్టమర్లు డబ్బులు డ్రా చేస్తున్న సమయానికి ఏటీఎం స్విచ్ ఆఫ్ చేయడం ఒక పద్ధతి. ఆ తరువాత కస్టమర్ వెళ్లాకా మళ్లీ స్విఛ్ ఆన్ చేసి డబ్బులు తీసుకుంటారు. ఎందుకంటే ఇంతలో ట్రాన్సాక్షన్ ప్రాసెసింగ్‌లో ఉంటుంది. ఇలా హైదరాబాద్‌లోని ఎస్సార్ నగర్, సనత్ నగర్, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో ఈ విధంగా రూ.లక్షలు కాజేశారు. ఇక డిపాజిట్ మెషిన్లలో క్యాష్ బాక్స్ తెరుచుకోగానే మధ్యలోనే చేతితో ఆపేసి నగదు లాగేయడం మరో ట్రిక్. నల్లకుంట, సైదాబాద్, చిక్కడపల్లి ప్రాంతాల్లో ఎస్బీఐ డిపాజిట్ యంత్రాల నుంచి ఈ తరహాలో నగదు మాయం చేశారు.

బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్లే : కొన్ని ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డులు లేని పాత ఏటీఎంలే దర్శనమిస్తాయి. వాటినే టార్గెట్‌గా మలచుకుంటారు ఈ అంతర్రాష్ట్ర ముఠాలు. హర్యానాలోని మేవాత్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన ఈ కేటుగాళ్లు పాత ఏటీఎంలోని సాంకేతిక లోపాలపై ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అక్కడి నుంచి పెద్ద పెద్ద నగరాలకు చేరుకుని, గూగుల్ మ్యాప్స్ సాయంతో ఏటీఎంలను గుర్తిస్తూ ఆటోలు, టూ వీలర్లపై తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారు.

## గోదావరి పుష్కరాల పనులకు రూ.వెయ్యి కోట్లు

-మొదటిపేజీ తరువాయి

ఆమోదం పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని కేబినెట్ నిర్ణయం వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల పనులకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తూ ఆమోదం గోదావరి పుష్కరాలకు తొలివిడతగా రూ.300 కోట్ల మంజూరుకు కేబినెట్ ఆమోదం గంగాధరలో నూతన డిగ్రీ కళాశాలలో పలు పోస్టుల మంజూరుకు ఆమోదం 20 రెగ్యులర్ టీచింగ్, 6 నాన్‌టీచింగ్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన 3 పోస్టుల మంజూరుకు ఆమోదం కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టులు మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదం అస్సాం రైఫిల్స్, బీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు భూకేటాయింపునకు ఆమోదం కరీంనగర్ జిల్లాలో 14 ఎకరాల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం వెలిదిలో 4, రుక్మాపూర్‌లో 5 ఎకరాల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపునకు ఆమోదం ఇంకా ఈ సమావేశంలో ఇందిరమ్మ కుటుంబ బీమాతో పాటు కొత్త పింఛన్ల పంపిణీపైనా చర్చించి నిర్ణయం తీసుకోన్నారు.

## నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు

-మొదటిపేజీ తరువాయి

సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని వెల్లడించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్? ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు.

**జీవరాశుల సంరక్షణ మన బాధ్యత**

కలెక్టర్లు వడగాలుల పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని గ్రామ, మండల స్థాయి సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని అన్నారు. ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేలా అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలతో పాటు జీవరాశుల సంరక్షణ కూడా మన బాధ్యతేనన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీటి తొట్టెలు, మట్టి కుండల ద్వారా పక్షులు, జంతువులకు తాగునీరు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

**రోజంతా ఎండలో డ్యూటీ చేయడంతో మృతి**

పెరుగుతున్న ఉష్ణాగ్రతలతో రాష్ట్రంలో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. వడదెబ్బకు గురై పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాలో ముగ్గురు చొప్పున మరణించారు. మృతుల్లో ఒకరు హోంగార్డు కాగా, ఇద్దరు కూలీలు, ఇంకొకరు వ్యాపారి. రోజంతా ఎండలో హైవేపెట్రోలింగ్ డ్యూటీ చేయడంతో ఆరోగ్యం సహకరించక ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో శ్రీనివాస్ కింద పడి మృతి చెందారు. మృతుల్లో ఒకరు మహారాష్ట్ర చంద్రాపూర్?కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పని నిమిత్తం ఆదిలాబాద్ వెళ్లిన చెప్పుల వ్యాపారి రాజేశ్వర్ వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ రాజేశ్వర్ మృతిచెందారు.

**సరస్వతి అంత్య పుష్కరాల్లో విషాదం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో విషాదఘటన చోటుచేసుకుంది. కాళేశ్వరంలోని ఇప్పల్ బోరు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. పుష్కరాలకు వచ్చిన ఆ వ్యక్తి ఇప్పలబోరు వద్ద అపస్మారక స్థితిలో పడిఉండగా స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆవ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బయటకు వెళ్లే సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**రాష్ట్రంలో భానుడి భగభగలు**

తెలంగాణలోని 15 జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా నారాయణపేట జిల్లాలో అత్యల్పంగా 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి.

## పీసీసీ మార్పు హైకమాండ్ నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

కొన్ని మీడియా సంస్థలకు కొన్ని అభిప్రాయాలు ఉంటాయి.. దానికి నేనేం చేయలేను. పీసీసీ మార్పు అనేది హైకమాండ్ చూసుకుంటుంది. ఏఐసీసీ దృష్టిలో తెలంగాణ పీసీసీది బెస్ట్ అని ఉంది. నాపై వ్యతిరేక వార్తలు రాసిన చానెల్.. గతంలో చాలా పాజిటివ్ వార్తలు కూడా ఇచ్చింది. దీనిపై సమయం, సందర్భం వచ్చినప్పుడు అన్ని విషయాలు మాట్లాడుతాను' అని వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచిగా మారుతుంది. బీఆర్ఎస్‌కు దూరదృష్టి లేదు.. హైదరాబాద్ పరిధి పెంచలేదు. సిటీ విస్తరిస్తే అభివృద్ధి జరుగుతుంది. హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీష్ రావు అంటున్నారా?. తెలంగాణపై కేంద్రం సవితి తల్లి ప్రేమ చూపిస్తుంది. స్టాలిన్‌లా మేము గత ప్రభుత్వ పథకాలు కొనసాగిస్తున్నాం. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేమ్స్ ఏఐసీసీకి పంపించాం.. త్వరలో ప్రకటిస్తాం. తెలంగాణలో కేబినెట్ విస్తరణ సీఎం చూసుకుంటారు. నా ప్రమేయం ఏమీ ఉండదు' అంటూ క్లారిటీ ఇచ్చారు.

## ఫ్యూచర్ సిటీ కాదు.. నీ ఫ్యూచరేంటి హరీష్



**హైదరాబాద్:** తెలంగాణలో ఫ్యూచర్ సిటీ విషయమై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. మాజీ మంత్రి హరీష్ రావుకు కౌంటరిచ్చారు. హరీష్ రావుకు తన ఫ్యూచరే తెలియదు.. ఫ్యూచర్ సిటీని ఆపుతారా? అంటూ సెటైర్లు వేశారు. బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీష్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి తాజాగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ..'ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఒప్పందాలున్నాయా?. పదేళ్లలో ఒక్క మెట్రో స్టేషన్ కూడా కట్టని బీఆర్ఎస్.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందంటే అసూయ కలగక మానదు. కేసీఆర్ కుటుంబ సభ్యుల కోసం ఎక్కడ పడితే అక్కడ ఫాంహౌస్‌లు కట్టుకున్నారు. కాంగ్రెస్.. రాష్ట్రం కోసం, దేశం కోసం ఫ్యూచర్ సిటీ కడుతుంటే ఆపుతాం అంటున్నారు. మూసీ ప్రాజెక్ట్‌కు బీఆర్ఎస్ అడ్డంకులు సృష్టిస్తోంది. మూసీని బాగుచేస్తామంటే అడ్డుపడుతున్నారు. లగచర్లలో ఇండస్ట్రీస్ పెట్టి యువతకు ఉద్యోగాలిస్తామంటే కుట్ర చేశారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని ఆపుతాం అంటున్నారు. అధికారంలోకి వస్తామంటూ పగటి కలలు కంటున్న హరీష్ రావు.. ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. హరీష్.. మీ పొలిటికల్ ఫ్యూచర్ లేకుండా కుట్రలు జరుగుతున్నాయి. ఫ్యూచర్ లేని బీఆర్ఎస్ పార్టీ నుండి పోయి మీ ఫ్యూచర్ కాపాడుకో. బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ వ్యాఖ్యలు చేశారు.

# సంపాదకీయం

## మళ్లీ తెరపైకి డీలిమిటేషన్


నియోజకవర్గాల పునర్విభజనపై చిదంబరం చేసిన ట్వీట్‌పై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేష్‌కు.. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాజ్యాంగ సంబంధిత ఆందోళనలకు రాజకీయ నాటకాలతో కాదు, రాజ్యాంగబద్ధమైన సమాధానాలతోనే స్పందించాలని చురకలు అంటించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా రాజ్యాంగబద్ధమైన హామీ ఉండాలని గతంలో చంద్రబాబు చెప్పిన రక్షణ ఎక్కడ అంటూ లోకేష్‌ను పొంగులేటి ప్రశ్నించారు. కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పి.చిదంబరం.. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ మధ్య ఎక్స్‌లో మాటల యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలోనే చిదంబరం చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ.. నారా లోకేష్ చేసిన ట్వీట్‌కు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారు. రాజ్యాంగ అంశాలకు రాజకీయాలతో కాకుండా.. రాజ్యాంగబద్ధంగానే స్పందించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌కు సమాధానంగా సుదీర్ఘంగా ట్వీట్ చేశారు. అందులో కొన్ని గణాంకాలతో కూడిన ఫోటోను కూడా జత చేశారు.ప్రియమైన లోకేష్ గారు అంటూ ట్వీట్‌ను మొదలుపెట్టిన మంత్రి పొంగులేటి.. డీలిమిటేషన్ బిల్లు-2026లో దామాషా లెక్కల ప్రకారం సీట్ల పెంపునకు సంబంధించిన చట్టబద్ధ హామీ ఎందుకు లేదని ప్రశ్నించారు. చట్టంలో ఎలాంటి రక్షణ కల్పించకుండా బీజేపీ నాయకుల మాటలను మాత్రమే దక్షిణాది రాష్ట్రాలు ఎందుకు నమ్మాలని నిలదీశారు. ఎన్నో ఏళ్ల హామీలు, భరోసాలతో చివరికి మోసపోయిన తర్వాత కూడా.. కేవలం మాటలనే దక్షిణాది ప్రజలు ఎలా విశ్వసిస్తారని పేర్కొన్నారు.జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందని ఈ బిల్లులో స్పష్టంగా పేర్కొన్నారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఈ రకంగా డీలిమిటేషన్ ప్రక్రియను అమలు చేస్తే లోక్‌సభలో తెలంగాణ వాటా ప్రస్తుతం 3.13 శాతం ఉండగా.. అది సుమారు 2.85 శాతానికి కు పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. దీంతో తెలంగాణ 2, 3 లోక్‌సభ సీట్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ వాటా 4.6 శాతం నుంచి సుమారు 4.1 శాతానికి తగ్గి.. 4, 5 సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తు చేశారు. సమర్థవంతంగా జనాభా నియంత్రణను అమలు చేసిన రాష్ట్రాలకే ఈ పరిస్థితి ఎదురవుతోందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు.ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీతో పాటు దక్షిణాది ప్రజలు కూడా పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. కానీ మీరు మాత్రం ఆ సమస్యను కావాలనే విస్మరిస్తున్నారని లోకేష్‌కు గుర్తు చేశారు. ప్రస్తుతం అనధికారికంగా చర్చిస్తున్న 50 శాతం సీట్ల పెంపు మోడల్ అమలు చేసినా.. ఉత్తర, దక్షణాది రాష్ట్రాల మధ్య అసమానతలు మరింత పెరుగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 80 నుంచి 120కు పెరిగితే.. తెలంగాణలో 17 నుంచి 26కు.. ఏపీలో 25 నుంచి 38కు మాత్రమే పెరుగుతాయని తెలిపారు. దీంతో యూపీ-తెలంగాణ మధ్య ప్రస్తుతం ఉన్న 63 సీట్ల తేడా 94 సీట్లకు పెరుగుతుందని గుర్తు చేశారు. ఇక యూపీ-ఏపీ మధ్య వ్యత్యాసం 55 నుంచి 82 సీట్లకు చేరుతుందని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు పార్లమెంట్‌లో మరింత రాజకీయ ఆధిపత్యం లభిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.అదే 50 శాతం పెంపు మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తే.. దక్షిణాదిన ఉన్న 5 రాష్ట్రాలకు కలిపి సుమారు 66 మాత్రమే అదనపు సీట్లు వస్తాయని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గణాంకాలు వెల్లడించారు. అదే సమయంలో ఉత్తరాదిన మరీ ముఖ్యంగా హిందీ బెల్ట్ రాష్ట్రాలకు దాదాపు 142 అదనపు సీట్లు లభిస్తాయని.. ఈ పెరుగుతున్న అసమానతే అసలు సమస్య అని తెలిపారు. జనాభా నియంత్రణ, మెరుగైన పాలన, ఆర్థికాభివృద్ధి, దేశ ఆర్థిక వ్యవస్థకు అధికంగా సహకరించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించకూడదని పొంగులేటి పేర్కొన్నారు.ఐదు దక్షిణాది రాష్ట్రాలు కలిపి దేశ జీడీపీలో సుమారు 31 శాతం నుంచి 33 శాతం వరకు వాటా కల్పిస్తున్నాయని.. కేంద్ర ప్రభుత్వ ఖజానాకు కూడా అధికంగా ఆదాయాన్ని అందిస్తున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. అయినప్పటికీ కేంద్రం నుంచి రాష్ట్రాలకు లభిస్తున్న కేటాయింపులు తక్కువగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ తప్పనిసరి అయితే.. ప్రాతినిధ్యాన్ని కేవలం జనాభా ఆధారంగా మాత్రమే నిర్ణయించకూడదని.. ఆర్థిక సహకారం, అభివృద్ధి సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 24 శాతం స్థానంలో.. దక్షిణాది రాష్ట్రాల జీడీపీ వాటాకు అనుగుణంగా లోక్‌సభలో కనీసం 33 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని పొంగులేటి డిమాండ్ చేశారుదక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా పక్కనబెట్టడం కాదని.. న్యాయమైన ప్రాతినిధ్యం లభించాలని తేల్చి చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలతో సంపూర్ణ ఏకాభిప్రాయం వచ్చిన తర్వాతే డీలిమిటేషన్ ప్రక్రియపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా 2001లో చంద్రబాబు నాయుడు.. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని రక్షించేందుకు చట్టంలో రాజ్యాంగబద్ధమైన హామీ ఉండాలని తేల్చి చెప్పారని.. అది కూడా కేవలం మాటల భరోసాలు సరిపోవని స్వయంగా ఆయనే చెప్పారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. అయితే ఆ రక్షణ డీలిమిటేషన్ బిల్లు-2026లో ఎక్కడ ఉందని లోకేష్‌కు మంత్రి పొంగులేటి సూటి ప్రశ్న వేశారు.

# కాలంతో మారకపోతే కనుమరుగే!




నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత వరుసగా లోక్‌సభ, వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయాలు సాధిస్తూ వస్తున్నది. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో కూటమి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నది. బీజేపీ విజయాల వెనుక దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం కీలక పాత్ర పోషిస్తున్నాయనే విమర్శలు నెలకొన్నాయి. ముందుగా ప్రతిపక్ష పార్టీల నేతలపై ఐటీ, ఈడీ, సీబీఐని ప్రయోగించడం.. వారిని బీజేపీలో చేర్చుకోవడం అధికారం చేపట్టడం వంటి ఉదంతాలను చూశాం. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకుంటూ అనుకూల ఫలితాలను సాధించడం చూస్తున్నాం. ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓటర్లను తొలగించి, బెంగాల్‌లో అధికారం చేపట్టి, పోల్ మేనేజ్‌మెంట్ తమకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు అనే విధంగా చెప్పుకొంటున్నది. కమలం పార్టీ పరిస్థితి ఇలా ఉంటే కమ్యూనిస్టు పార్టీలది మరో విధమైన పరిస్థితి. సుదీర్ఘమైన పోరాట, రాజకీయ చరిత్ర కలిగిన వామపక్ష పార్టీలు కనుమరుగవుతున్నాయి. దాదాపు ఒక శతాబ్దం క్రితం 1925లో దేశంలో ఆవిర్భవించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) దేశంలో రోజురోజుకు విస్తరించడంతో తమ అనుబంధ సంస్థ అయిన బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ తన ప్రాభావాన్ని, ప్రాబల్యాన్ని కోల్పోతున్నది. ఇక లోతుగా విశ్లేషిస్తే 1917లో రష్యా విప్లవం, 1949 చైనా విప్లవం అప్పటి వలస విముక్తి దేశాలకు, నవ స్వాతంత్ర్య దేశాలపై పెను ప్రభావం చూపాయి. మన దేశంలో కమ్యూనిస్ట్ ఉద్యమం ఒక రాజకీయ పార్టీగా కాకుండా, ఒక సామాజిక చలనంగా, వర్గ పోరాటంగా, జీవన విధానంగా పుట్టింది. స్వాతంత్ర్య పోరాటంలో, తదుపరి తెలంగాణ సాయుధ పోరాటంలో, భూసంస్కరణలు అమలు చేయడానికి, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షణకు కార్మిక, కర్షక హక్కుల కోసం పోరాడే పార్టీగా కమ్యూనిస్ట్ ఉద్యమం దేశంలో దాదాపు అరవై శాతం జనాభాపై మంచి ప్రభావాన్ని చూపింది. అందువల్లనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక కమ్యూనిస్టులు పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికై, ప్రతిపక్ష పార్టీగా సముచిత పాత్ర పోషించారు. పుచ్చలపల్లి సుందరయ్య ఒక ఉదాహరణ. దేశ మొదటి సార్వత్రిక ఎన్నికల్లో జవహర్‌లాల్ నెహ్రూ కంటే అత్యధిక మెజారిటీతో నల్లగొండ నుంచి కమ్యూనిస్ట్ నాయకుడు రావి నారాయణరెడ్డి గెలుపొందారు. అంటే అప్పట్లో కమ్యూనిస్టులంటే ప్రజల్లో ఎంత గౌరవం, అభిమానం ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 1957లోనే ప్రపంచంలోనే ప్రజాస్వామ్య పద్ధతిలో కేరళంలో ఈఎంఎస్ నముద్రిపాద్ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) అధికారంలోకి వచ్చింది. అయితే తదుపరి కేంద్ర ప్రభుత్వం కుయుక్తులతో ఆ ప్రభుత్వాన్ని కూలదోసింది. ఆ తర్వాత సైద్ధాంతిక విభేదాలతో సీపీఐ రెండుగా చీలిపోయింది. కొత్తగా భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్)- సీపీఎం ఏర్పాటైంది. ప్రస్తుతం సీపీఐ, సీపీఎం రెండు పార్టీలు కొనసాగుతున్నాయి. సీపీఎం తన విశిష్టమైన నాయకత్వం, ఉద్యమాలు, పోరాటాలు, గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ఉన్న క్యాడెర్, విద్యార్థి, కార్మిక, కర్షక సంఘాల పోరాటాలు, సహకారంతో దాదాపు 50 ఏండ్లపాటు మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నడిపించింది. బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు, త్రిపురలో 1993 నుంచి 2018 వరకు, దఫదఫాలుగా కేరళంలో 2026 మే వరకు అధికారంలో ఉన్నది. ప్రస్తుతం కమ్యూనిస్ట్ పార్టీలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేవు. ఈ రాజకీయ పరిణామాలు పేద, మధ్య తరగతి ప్రజలు, కార్మిక, కర్షక వర్గాలకు అభ్యుదయ, ప్రజాస్వామ్యవాదులకు తీవ్ర నిరాశ కలిగిస్తున్నది. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో, జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాయి. ఒక దశలో జ్యోతిబసు ప్రధాన మంత్రిగా ఉండాలనే స్థాయిలో గుర్తింపు పొందిన వామపక్షాలు (సీపీఎం) నేడు తమ ప్రాబల్యాన్ని కోల్పోయాయి. రాజకీయ పరిణామాలను కమ్యూనిస్ట్ పార్టీలు ఇకనైనా విశ్లేషణ, సమీక్ష చేసుకోవాలి. కొంతమంది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాల ప్రకారం కొన్ని చారిత్రక తప్పిదాలు, కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలు, సిద్ధాంతం- ఆచరణ మధ్య వ్యత్యాసం, సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రజల్లో వినిమయ సంస్కృతి పెరగడం, మధ్యతరగతి ఆకాంక్షలు, యువత అభీష్టాలు అంచనా వేయడంలో లోపం, ప్రపంచీకరణ ప్రభావం, నాయకత్వ లేమి, తగ్గిన ఉద్యమాలు, సోషల్ సైన్సెస్ ప్రాధాన్యత తగ్గడం, డబ్బులు సంపాదించడం, ఖర్చు పెట్టడం తప్ప ప్రజల్లో ఉద్యమాల పట్ల ఆసక్తి లేకపోవడం ముఖ్యంగా తన సైద్ధాంతిక శత్రువును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగిన వ్యూహాలు, ప్రణాళికలను రచించకపోవటం తదితర కారణాల వల్ల వామపక్షాలు ఢీలా పడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో ఓటమితో ఫలానా పార్టీ పని పూర్తిగా అయిపోయింది అని చెప్పడం కుదరదు. ఓటమి తాత్కాలికం-ఆశయం శాశ్వతం అనే భావనతో ముందుకు సాగాలి. దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో ఎర్రజెండాలు రెపరెపలాడాలి. 20వ శతాబ్దం కమ్యూనిస్ట్ ప్రపంచమే అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇక మనదేశంలో కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న 1977 నుంచి నేటి వరకు సుమారు యాభై ఏండ్ల వామపక్షాల ప్రయాణం చరిత్రాత్మకమైనది. ప్రపంచ స్థాయిలోనే కేరళం విద్య, వైద్యం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం వంటి వాటిలో గణనీయమైన స్థానం సంపాదించుకుని, దేశానికే ఆదర్శంగా నిలిచింది. ముఖ్యంగా కొవిడ్ కాలంలో, వరద విపత్తుల సమయంలో తాజా మాజీ సీఎం పినరయి విజయన్ పోషించిన పాత్ర శ్లాఘనీయం.
ఇన్ని ఘనతలు సాధించిన వామపక్షాలు తిరిగి అధికారంలోకి రావడానికి ఇకనైనా ఆత్మావలోకనం చేసుకోవాలి. విద్యార్థుల స్థాయిలోనే సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపట్టే విధంగా కార్యాచరణ సిద్ధం చేయాలి. నేటి జెన్ జీ మిలీనియం యువత ఆకాంక్షలకు అనుగుణంగా పథక రచన చేయాలి. ప్రజల కోసం పోరాడేవే పార్టీయే కమ్యూనిస్ట్ పార్టీలు అని, సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ ఎర్రజెండా ఉంటుంది అని తెలియజేయాలి. దూరం అవుతున్న విద్యార్థులు, యువత, రైతులపై పార్టీలు దృష్టి పెట్టాలి. మార్క్సిస్ట్ సిద్ధాంతంపై ఆధారపడి ప్రజాస్వామిక విప్లవం ద్వారా భారత సమాజాన్ని పరివర్తన చెందించాలనేది కమ్యూనిస్ట్ పార్టీ ఆశయం. అయితే, తన భావజాలాన్ని వదలకుండా యువత, నేటి సమస్యలను అనుసంధానం చేసుకుంటూ వామపక్షాలు ముందుకు కదిలితేనే పూర్వ వైభవం వస్తుందని గ్రహించాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, సోషల్‌మీడియాపై పట్టు సాధించాలి. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఒంటెత్తు పోకడలు, ప్రజాసమస్యల్లో ప్రజా ప్రతినిధుల ప్రమేయం, అవినీతి, కమ్యూనిస్టుల అణచివేత, ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు, ముఖ్యంగా ప్రధానితోపాటు ఇతర కేంద్ర మంత్రులు ప్రత్యక్షంగా ప్రచారంలో పాల్గొనటం, మతపరమైన విభజన చిచ్చుతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇకనైనా తృణమూల్ కాంగ్రెస్ విశ్లేషణ చేసుకోవాలి. అసోంలో బీజేపీ, పుదుచ్చేరిలో ఎన్‌డీఏ రెండోసారి పాలనా పగ్గాలు చేపట్టాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో ఇండి కూటమి కూడా తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ కూటమి లోటుపాట్లే పరాజయానికి కారణం. పార్లమెంట్ ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు కలిసి పని చేయటం, ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికి వారు విడివిడిగా పోటీ చేయటం వల్ల ఈ రెండేండ్ల కాలంలో కూటమి నష్టపోయింది. ఇప్పటికే ఆప్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే వంటి పార్టీలు జట్టుకు దూరం వెళ్లాయి. తమిళనాడులో డీఎంకే 1950, 1960 ద్రవిడ సాంప్రదాయ పద్ధతుల నుంచి బయటపడకపోవడమే ఓటమికి ఓ కారణం. ఇదే విషయాన్ని నేటి యువత తమ ఓటు ద్వారా తెలియజేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను గమనిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా పార్టీలు తమ వైఖరులను మార్చుకోవాలి. లేకపోతే మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది.

# సమాజానికి 'పోక్సో' ఓ హెచ్చరిక!




ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన వంటివి భవిష్యత్తులో జరగకూడదని 2013లో కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ ప్రతి లక్ష మంది చిన్నారుల్లో 15.6 మంది పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే లైంగిక నేరాలకు గురవుతున్నారనీ, ఏటికేడాది ఈ చట్టం కింద నమోదయ్యే కేసులు కూడా పెరుగుతున్నాయని జాతీయ నేర నమోదు విభాగం(ఎన్సీఆర్బీ) ఈ మధ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఒక్క 2024లోనే దేశం మొత్తం మీద 69,191 పోక్సో కేసులు నమోదైతే, వారిలో తీవ్ర లైంగిక దాడులకు గురైన బాలికల సంఖ్య 43,675. కాగా ఈ బాధితుల్లో 16--18 ఏళ్ల బాలికలు 24,000 మందికి పైనే ఉన్నారు. ప్రతి పోక్సో కేసు వెనుక ఛిద్రమైన ఒక చిన్నారి జీవితమే కాదు, వ్యవస్థాగత లోపమూ కచ్చితంగా ఉంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వెలుగులోకి వచ్చిన రెండు వరుస ఘటనలు నేటి కాలంలో పిల్లల భద్రతా లోపాలను మరోసారి ఎత్తిచూపుతున్నాయి. అదేవిధంగా సమాజానికి ప్రమాద సంకేతాలనూ పంపుతున్నాయి.
హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన సంఘటన, అలాగే ఒంగోలుకు చెందిన ఒక మహిళా ప్రత్యేక అధికారిణి పోక్సో కేసులో జైలుకు వెళ్లడం వంటి సంఘటనలను కేవలం వ్యక్తిగత ఘటనలుగా చూడకూడదు. ఇవి సమాజంలో పెరుగుతున్న ప్రమాదకర ధోరణికి హెచ్చరికలు. విలువల సంక్షోభానికి, అధికార వ్యవస్థల్లో ఏర్పడుతున్న నైతిక పతనానికి ఇవి స్పష్టమైన సంకేతాలు. చాలావరకూ పోక్సో కేసుల్లో బాధితులు తమకు తెలిసిన వ్యక్తుల చేతుల్లో లైంగిక దాడులకు గురవుతున్నారు.
అసలు ఎందుకు ఇటువంటి ఘటనలు పెరుగుతున్నాయి? ఇది కేవలం చట్టవ్యవస్థ వైఫల్యమా? లేక సమాజం మొత్తం నెమ్మదిగా ఒక అనాసక్తి, నైతిక గందరగోళం వైపు జారిపోతుందా? ఇలాంటి ఘటనలు బయటపడినప్పుడల్లా మన సమాజం రెండు ప్రమాదకరమైన ప్రతిస్పందనలు చూపుతోంది. ఒకటి-- ఇవి రాజకీయంగా తయారు చేసిన కేసులు కావచ్చు అని. రెండోది-- రెండు రోజులు చర్చించి మర్చిపోవడం. ఈ రెండు ధోరణులూ ప్రమాదకరమే. ఇప్పుడు అవసరమైంది కేవలం చట్టాలు సక్రమంగా అమలు కావడం ఒక్కటే కాదు. వాటి గురించి బాలలకు అవగాహన కల్పించడం, బాధ్యతాయుతమైన వ్యక్తులుగా మెలిగేలా, తమని తాము కాపాడుకునేలా చూడటం కూడా ఎంతో అవసరం.
ఇప్పుడు నేరాల తీరు మారుతోంది. 'డిజిటల్ గ్రూమింగ్' అనే కొత్త ముప్పు పిల్లలను మరింత ప్రమాదంలోకి నెడుతోంది. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు, ప్రైవేట్ చాట్స్, గేమింగ్ ప్లాట్‌ఫారాలు-- నేరస్తులకు పిల్లల వరకు చేరుకునే మార్గాలుగా మారుతున్నాయి. పిల్లలు ఏం చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? అనే విషయంలో కుటుంబాల్లో పర్యవేక్షణ తగ్గిపోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. అలానే వెబ్ సిరీస్‌లు, సినిమాల్లోని మితిమీరిన నేర, అశ్లీల దృశ్యాలు యువతపై వికృత ప్రభావం చూపుతున్నాయి. వాటి ప్రేరణతో అకృత్యాలకు, నేరాలకు పాల్పడుతున్న మైనర్లు, యువత సంఖ్య కూడా ఇటీవల అధికమవుతోంది. చాలా మంది చిన్నారులు తమపై జరిగిన దాడిని బయటకు చెప్పలేకపోతున్నారు. ఎందుకంటే అది లైంగిక దాడి అని తెలియకపోవడం, మరొకటి భయం. 'కుటుంబ పరువు పోతుంది' అనే మానసిక ఒత్తిడి వారిని మౌనంలోకి నెడుతోంది. చాలా విద్యాసంస్థల్లో చైల్డ్ ప్రొటెక్షన్ మెకానిజం కేవలం పత్రాలకే పరిమితం అవుతోంది. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చాలా చోట్ల స్పష్టమైన అవగాహన ఇవ్వడం లేదు. స్కూల్ కౌన్సిలర్లు, ఫిర్యాదు వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో పిల్లలకు తమ సమస్యలను చెప్పుకునే అనువైన వాతావరణం విద్యాసంస్థల్లో కరువవుతోంది.
పిల్లలకు మొదటి గురువులు తల్లిదండ్రులే. కాబట్టి వాళ్లని వాళ్లు కాపాడుకోవడంతో పాటు సమాజంలో ఉత్తమ పౌరుడిగా ఎదిగేందుకు రెక్కలు ఇవ్వాలి. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడటమేకాక, స్వేచ్ఛగా ప్రతి విషయం పంచుకునే సమయాన్నీ చొరవనీ కల్పించాలి. ఎన్ని తలమునకలయ్యే బాధ్యతలు ఉన్నా పిల్లల్ని ఓ కంట గమనిస్తూ ఉండాలి. వారి భావోద్వేగాల్ని, భయాల్ని చెప్పకుండానే అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి.
స్కూళ్లలో నైతిక విలువల పట్ల విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాలి. అందుకోసం చదువుల్ని సంస్కరించాలి. విద్యాసంస్థల యాజమాన్యాలు సైతం విద్యార్థులను నిశితంగా గమనించాలి. ప్రతి స్కూల్‌లోనూ పిల్లల భద్రతతో పాటు, పోక్సో చట్టం గురించి అవగాహన తరగతులు నిర్వహించాలి. పిల్లలకు సైబర్ నేరాలతోపాటు, చట్టాలు, శిక్షల గురించి కూడా తెలియజెప్పాలి. మీడియాలో నిరంతరం వచ్చే విషయాలను వారి దృష్టికి తేవడంతో పాటు పర్యవసానాలను వివరించి చెప్పాలి. స్కూళ్లలోనే కాదు, గేటెడ్ కమ్యూనిటీల నుంచి గ్రామవార్డుల వరకూ దీనిని చర్చించదగిన అంశంగా పరిగణించి ప్రభుత్వంతో పాటు ఎన్జీవోలు కూడా సామాన్యుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నడుం బిగించాలి. పోక్సో చట్టం గురించి చెప్పడంతో పాటు అన్యాయం జరిగిన వెంటనే ఫిర్యాదు చేసే ధోరణిని అలవాటు చేయాలి. ఈ విషయం మనం సీరియస్‌గా తీసుకోకపోతే, రేపటి తరానికి భద్రమైన బాల్యం ఇవ్వలేం.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరపాలి..





ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

**బెల్లంపల్లి,మే23(సూర్యరేఖ)** బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మనోజ్ కుమార్, వివిధ మండలాల తాహసిల్దార్లు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి మండలంలోని గ్రామపంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులు తమ పంటను విక్రయించుకునే సమయంలో వేచి ఉండాల్సిన పరిస్థితులు రాకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంటలో ప్రతి గింజను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని,ఈ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు,నీడ, తార్పాలిన్లు,హమాలీలు, రవాణా వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేసిన ఎమ్మెల్యే,రైతులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఉప్పల్ శేషసాయినగర్‌లో రూ.64లక్షలతో అభివృద్ధి పనులు..





అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించిన రజితపరమేశ్వర్ రెడ్డి
త్వరలో సీసీ రోడ్ల పనులు ప్రారంభం..

**ఉప్పల్,మే23(సూర్యరేఖ)** ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి పనులను ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.అందులో భాగంగానే శనివారం శేషసాయినగర్ కాలనీలో విస్తృతంగా పర్యటించిన రజిత రూ.64లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..."శేషసాయినగర్, మల్లికార్జున్ నగర్ కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కొత్త డ్రైనేజీ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఇక ఉండదు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కాగానే తొందరలోనే రూ.64 లక్షలతో సీసీ రోడ్ల పనులు కూడా పూర్తి చేస్తాం. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులకు స్పష్టం చేశాం.ఉప్పల్‌లో ప్రతికాలనీ అభివృద్ధే మా ధ్యేయం"అని అన్నారు.కాలనీ వాసులు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న రజితకి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శేషసాయినగర్ కాలనీ అధ్యక్షులు అచ్చన శ్రీనివాస్,నర్సయ్య,రాకేష్ నాయక్,మోహన్ రెడ్డి,వెంకటేశ్వరరావు, నరసింహారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,పవన్ కుమార్,సల్ల ప్రభాకర్ రెడ్డి,పూజారి హనుమంతు,వేణుగోపాల్ రెడ్డి,విప్లవ రెడ్డి,హనుమంతు,చారి,నవీన్,వంక మాధవ,శ్రావణి,వంశీ,మౌనిక, అనుష, భాస్కర్, తుమ్మల దేవేందర్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడి,ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు లాభాదాయకం..

రైతులు యూరియా,రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి..
నానో యూరియా,నానో డిఏపి వైపు రైతులు దృష్టి సారించాలి..
ఆత్మకమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి,మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి
మరిపెడలో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం..







**మరిపెడ,మే23(సూర్యరేఖ)**పంట మార్పిడి,ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడంతోనే రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారుతుందని ఆత్మకమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి,మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలో అంబేద్కర్ కమ్యూనిటి హాల్ లో జరిగిన రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆత్మకమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి,కెవికే మల్యాల శాస్త్రవేత్తల సుహాసిని,ఏఓ వీరాసింగ్,లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .రైతులందరూ ఒకే పంట నిరంతరం సాగు చేయడం వలన భూసారం జరుగుతుందని తెలిపారు.కాబట్టి ప్రతి రైతు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని,యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు.రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వలన భూమి తమ సహజ గుణాన్ని కోల్పోయి రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూసార పరీక్షలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలని వారు కోరారు.శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు రసాయనిక ఎరువులను,పురుగుల మందులను తగ్గించి పంట పండించడం రైతులకు ఎంతో లాభదాయకమని చెప్పారు.అనంతరం కెవికే మల్యాల శాస్త్రవేత్తల సుహాసిని రైతులకు సాగులో మెలకువలు గురించి వివరించారు.రైతులు యూరియా,రసాయన ఎరువుల వాడకాన్ని చాలావరకు తగ్గించాలని ఆమె సూచించారు.మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి మంచి లాభాలు పొందాలని ఆమె సూచించారు.రైతులు ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేసిన విత్తనాలకు ఖచ్చితంగా రశీదు తీసుకోవాలని,పంట పూర్తయ్యే వరకు దానిని భద్రపరుచుకోవాలని తెలిపారు.సాగు నీటిని ఆదా చేసి భవిష్యత్ తరాలకు అందించడం మన అందరి బాధ్యత అని చెప్పారు.పంట మార్పిడిని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ అరవింద్,రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## (టీబీ)రహిత దేశంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం..

డాక్టర్ ప్రదీప్




**కామారెడ్డి,మే23(సూర్యరేఖ)** టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని వడ్లూర్ గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు.హెల్త్ క్యాంప్ లో దగ్గు,జ్వరం,బరువు తగ్గడం,ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు గల వ్యక్తులకు ఎక్స్రేలు నిర్వహించారు.జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా.ప్రదీప్ మాట్లాడుతూ...ప్రజలందరి సహకారంతో క్షయ (టీబి)రహిత దేశంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో 1వార్డు కౌన్సిలర్ గడ్డమిది మహేష్,జిల్లా క్షయ నియంత్రాణ అధికారి డా.ప్రదీప్ వైద్యులు డా.స్వాతి,ఆరోగ్య సిబ్బంది శామ్,విజయ్, చంద్రకాంత్,త్రివిక్రమచారి,శోభ, జ్యోతి,స్వప్న,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి,షాదిముభారక్ చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలి..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,మే23(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి,షాదిముభారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఈ మేరకు లబ్ధిదారులకు ప్రయోజనాలు కల్పించాలని సూచించారు.మల్లాపూర్ వి.ఎన్.ఆర్ గార్డెన్లో ఉప్పల్ మండలానికి చెందిన 233కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...చెక్కుల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ. ..రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నదని చెప్పారు.అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ ప్రయోజనాలను అందించనున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ఉప్పల్ ఆర్ఐ ఎం.అశ్వినిగౌడ్,జూనియర్ అసిస్టెంట్లు ఎం,అనంత రాములు,పి. వెంకన్న,ఎం,అలివేలు,ఆపరేటర్ సునీత, అటెండర్స్ సత్యనారాయణ, విఆర్ఎ స్వామి, రెవెన్యూ సిబ్బంది,బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చిల్కానగర్ డివిజన్ నాయకులు





**ఉప్పల్,మే23(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిను చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఆయురారోగ్యాలు,దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఒర్సురాజు, బోడపట్ల కుమార్,శివ,కార్తీక్,ఆసిఫ్, సాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కార్మికుల డిమాండ్ల సాధనకై జూన్ 5వ తేదీన ఎంఎంసి తార్నాక ప్రధాన కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయండి..

ఉప్పల్ సిఐటియు కార్యదర్శి జే.వెంకన్న పిలుపు

**ఉప్పల్,మే23(సూర్యరేఖ)**జిహెచ్ఎంసి కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం జూన్ 5న మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ తార్నాక హెడ్ ఆఫీస్ దగ్గర ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సిఐటియు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే. వెంకన్న,సిఐటియు సీనియర్ నాయకులు ఎస్. నాగరాజు,లు చిలుకానగర్ లో జిహెచ్ఎంసి కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జూన్5న జరిగే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్ల అమలును వ్యతిరేకించాలని,మున్సిపల్ కార్మికులందరిని పర్మినేంట్ చేయాలని,కనీసవేతనం రూ.26,000/లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.మూడు కార్పొరేషన్లలో పని చేస్తున్న కార్మికులందరికి జిహెచ్ఎంసిలో చెల్లిస్తున్న వేతనాలను తక్షణమే చెల్లించాలి,ప్రమాదాల్లో మరణించిన మున్సిపల్ కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు.60 సం॥రాల వయస్సు పైబడిన కార్మికులను తొలగిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి రిటైర్మెంట్ బెన్ఫిట్ రూ.10 లక్షలు,వారసులు లేని వారికి రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.30,000/-లు మట్టి ఖర్చులు ఇవ్వాలని,ఆదివారాలు, పండుగ సెలవులు వారాంతపు సెలవులు,8గంటల పని దినాన్ని అమలు చేయాలని,మూడు కార్పొరేషన్ల



పరిధిలోని ఎస్.ఎఫ్.ఎ.లకు,జవాన్లకు వర్క్ ఇనిస్పెక్టర్లకు ప్రమోషన్లు కల్పించాలి,మున్సిపల్ కార్మికులందరికీ మొదటి ప్రాధాన్యతనిచ్చి డబుల్ బెడ్రూం,ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి,బయోమెట్రిక్ అటెండెన్స్ విధానంలో మార్పులు చేయాలి,పని ప్రదేశాల వద్దనే వస్త్రం హజరు తీసుకోవాలని అనే డిమాండ్లను అమలు చేయాలని ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్మికులు విమల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రైతులకు భారీ నష్టం..





బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి,మే23(సూర్యరేఖ)** బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి గ్రామ శివారులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన సాగునీటి బోర్లు,స్ప్రింక్లర్ పైపులు,మామిడి,టేకు, ఎర్రచందనం తోటలను బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరిశీలించారు.బాధిత రైతులతో మాట్లాడి జరిగిన నష్టం వివరాలను తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా షార్ట్ సర్క్యూట్ సంభవించి రైతుల సాగునీటి బోర్లు పూర్తిగా కాలిపోయి నిరుపయోగంగా మారాయని అన్నారు.అంతేకాకుండా సుమారు 300 స్ప్రింక్లర్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయని, దాదాపు 200ఎకరాల్లో విస్తరించిన మామిడి,టేకు, ఎర్రచందనం తోటలు కాలిపోవడంతో రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.ఘటన జరిగి మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు అధికార పార్టీ ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్ లేదా ఇతర ఉన్నతాధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత రైతులకు భరోసా కల్పించలేదని ఆయన విమర్శించారు.రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని,నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు.రైతులు తిరిగి వ్యవసాయ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో బట్వాన్‌పల్లి సర్పంచ్ రాజేష్,దుగ్నేపల్లి ఉపసర్పంచ్ వినోద్,వార్డు సభ్యులు వెంకటరమణ, అంకులు,సోము,వెంకటేష్,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ,మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రాజశేఖర్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్,బీఆర్ఎస్ నాయకులు గణేష్ గౌడ్,అశోక్ గౌడ్, మల్లేష్,శ్రీనివాస్, మోహన్,నారాయణ,శేఖర్,కాశీరాం,ధనుంజయ్, వినోద్, హరికృష్ణ,రంజిత్,శంకర్,కార్యకర్తలు,బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు కొండంత భరోసా...





ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి..

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి..

సర్పంచ్ బానోత్ విజయ కౌర్ కిషన్ సింగ్

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ..

**మరిపెడ,మే23(సూర్యరేఖ)** పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి కొండంత భరోసాగా నిలుస్తుందని బానోత్ విజయకౌర్ కిషన్ సింగ్ అన్నారు.ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బోట్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బోట్యా తండాకు చెందిన డీఎస్ నవీన్ కు 1,65,500,డీఎస్ వసంతకు18 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా ఆచెక్కులను శనివారం ఆమె గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ విజయకౌర్ కిషన్ సింగ్ మాట్లాడుతూ... పేద,మధ్యతరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందన్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని,వారి కష్టసుఖాలలో అండగా నిలుస్తున్నదని తెలిపారు.ఆర్థిక స్థోమత లేక అనారోగ్యాల బారిన పడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి కార్పొరేట్ వైద్యంతో స్వస్థత పొందేందుకు ఎంతగానో దోహదపడు తున్నదన్నారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుం టున్న పేదలు అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశ్యంతో ప్రజా ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.ఇబ్బందులతో ఉన్న మాకు ఆర్థిక చేయూత నిచ్చిన ముఖ్యమంత్రికి,ఎమ్మెల్యే రామచం ద్రునాయక్ కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోత్ కవిత పాప నాయక్,వార్డు సభ్యులు విజయ రామా రావు,రుకా,సుమన్ నాయక్,కార్యదర్శి రాజు,సిబ్బంది,తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగునికి పెన్షన్ మంజూరు చేయండి సారూ...

**నిజాంపేట,మే23(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన హేమ రవీందర్ కు గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి,ముఖ్యమంత్రి హయాంలో వికలాంగుల పెన్షన్ కింద రూ.200 వచ్చేవి అన్నారు.సదరు క్యాంపు పెట్టినప్పటి నుండి పెన్షన్ 200కాస్త పెన్షన్ రావడం లేదని బాధితుడు ఆవేదన చెందుతున్నాడు.గత ప్రభుత్వాలు మారినప్పటికీ లేరని బాధితుడు ఆరోపిస్తున్నారు.ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ సర్టిఫికెట్ ఉన్న సర్టిఫికెట్ అధికారులకు చూపించిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బాధితునికి పెన్షన్ మంజూరు చేసేలా చూడాలని అధికారులను వేడుకుంటున్నాడు.




MEDICAL CERTIFICATE IN RESPECT OF PHYSICALLY HANDICAPPED CERTIFICATE

## సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మెకు మద్దతు ప్రకటించిన

తెలంగాణ ఉద్యమ ఉద్యమకారుల జేఏసీ ఫౌండర్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ

వారి సమస్యల కోసం త్వరలో 1000 మందితో బహిరంగ సభ..





**ఉప్పల్,మే23(సూర్యరేఖ)** సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యలపై గత పది రోజులుగా జరుగుతున్న సమ్మెకు మద్దతుగా శనివారం చిలుకానగర్ డివిజన్ లో జరిగిన ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఫౌండర్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ హాజరై వారి పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించారు.త్వరలో ఉప్పల్ నియోజకవర్గం లోని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ మరియు సెంట్రింగ్ వర్కర్స్ యొక్క సమస్యలపై1000 మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం కొరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్మరెడ్డి,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎం. పరమేశ్వర్ రెడ్డి,బీజేపీ నాయకులను కలవనున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ చిలుకానగర్ అధ్యక్షులు పైడిపాల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా అతిధులుగా,బిఎస్పి స్టేట్ కోఆర్డినేటర్ విష్ణన్న,దళిత సంఘాల జేఏసీ కన్వీనర్ మల్కారీ అశోక్ బాబు,క్రిస్టియన్ జేఏసీ కన్వీనర్ పాస్టర్ బి.ఆరోగ్యం,పాస్టర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకుని కుటుంబానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శ..



**ఉప్పల్,మే23(సూర్యరేఖ)** కొద్ది రోజుల క్రితం ఆకస్మికంగా మరణం చెందిన నాచారం డివిజన్ సీనియర్ నాయకులు జాకీర్ హుస్సేన్ కుటుంబ సభ్యులను శనివారం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...జాకీర్ హుస్సేన్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు విశేష కృషి చేశారని,వారి సేవలను పార్టీ ఎప్పటికీ మరువలేదని అన్నారు.వారి కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.అలాగే జాకీర్ హుస్సేన్ ఆకస్మిక మరణం బాధాకరమని పేర్కొంటూ,వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం, మనోబలం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్ కుమారుడు సల్మాన్ కుటుంబ సభ్యులు,కాజా మొయినుద్దీన్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ చేయూత పెన్షన్లు,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి



**మరిపెడ,మే23 (సూర్యరేఖ)**అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పెన్షన్లు,ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.శనివారం ఆయన మరిపెడ మున్సిపల్ కేంద్రంలో సిపిఐ మరిపెడ పట్టణ కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఇండ్లు,ఆసరా పెన్షన్లు మంజూరు చేయడంలో తీవ్ర కాలయాపన చేసి అర్హులను మోసం చేసిందని,నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినావృద్ధులు, వికలాంగులకు, వితంతువులకు పెన్షన్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు.ఇప్పటికైనా అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పెన్షన్లు అందించాలని,ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో రకరకాల కొర్రీలు పెట్టి పేదలను ఇబ్బంది పెట్టే విధానానికి స్వస్తి చెప్పి,అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలనిఆయన కోరారు.ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్,పోలెపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# యువశక్తి గులాబీ వైపు..

కాంగ్రెస్ హామీల గాలివానలో ఆశలు చెదిరిన వేళ..
కేసీఆర్ సిద్ధాంతాలకే యువత మద్దతు..రామాయంపేటలో బిఆర్ఎస్‌లో భారీ
చేరికలు.. యువతకు అండగా బిఆర్ఎస్ నిలుస్తుంది.. పద్మాదేవేందర్ రెడ్డి..

**రామాయంపేట,మే23(సూర్యరేఖ)** తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ గులాబీ జోష్ కనిపిస్తోంది.అధికార కాంగ్రెస్‌పై పెరుగుతున్న అసంతృప్తి,అమలు కాని హామీలతో విసిగిపోయిన యువత మరోసారి బిఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతోంది.మెదక్ జిల్లా రామాయంపేటలో శనివారం జరిగిన చేరికల కార్యక్రమం ఆ మారుతున్న రాజకీయ సంకేతాలకు నిదర్శనంగా నిలిచింది. గ్రామీణ యువశక్తి గులాబీ కండువా కప్పుకుని బిఆర్ఎస్‌కు బలం చేకూర్చింది.రామాయంపేట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు మాజీ డిప్యూటీ స్పీకర్,మెదక్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించిన ఆమె..యువతే తెలంగాణ భవిష్యత్తని,వారి ఆశయాలకు అండగా నిలిచేది బిఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు.పార్టీలో చేరిన వారిలో వగ్గు వంశీ (రఘుపతి),వెల్మల రేవంత్, ముత్యం రంజిత్,ముత్యం సందీప్,వగ్గు బన్ని, ముత్యం విష్ణు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి ఘాటుగా మాట్లాడుతూ...‘ ‘తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపింది కేసీఆర్ నాయకత్వమే రైతు బంధు నుంచి రైతు బీమా వరకు,కల్యాణలక్ష్మి నుంచి 24గంటల ఉచిత విద్యుత్ వరకు ప్రతి పథకం ప్రజల జీవితాల్లో వెలుగు నింపింది.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోంది.ప్రజల ఆశలు నెరవేర్చగలిగే శక్తి బిఆర్ఎస్‌కే ఉంది” అని



విమర్శించారు.గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకూ బిఆర్ఎస్‌పై విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్న ఆమె..యువత పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.కార్యక్రమంలో రామాయంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్,పాక్స్ చైర్మన్ బాధే చంద్రం,మండల పార్టీ బాధ్యులు రాగి ఉమామహేశ్వర్,అక్కన్నపేట గ్రామ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి,టౌన్ యూత్ అధ్యక్షుడు రొయ్యల నవీన్,మండల నాయకులు శ్రీకాంత్ సాగర్,మద్దూరి శ్రీనివాస్,తాటిపల్లి రాంకీ, దొమ్మట్ట శ్రవణ్ గౌడ్,వెల్మల మహేశ్,బోడ శ్రీకాంత్ (బబ్లూ), పప్పయ్యగారి నర్సింలు,ఎల్లగారి రాజు, నాగరాజు,వంశీ సాగర్,పవన్ సాగర్, రాఘవేంద్ర, ప్రశాంత్ సాగర్,స్వామి,సిద్ధారములు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరిన మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రాంటెంకి

**బెల్లంపల్లి,మే23(సూర్యరేఖ)**తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు,రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న,పార్టీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల ప్రవీణ్ రాజ్ చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రాంటెంకి తెలంగాణ రాజ్యాధికార పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ...తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజల హక్కుల పరిరక్షణ,సామాజిక న్యాయం సాధన, యువత అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతున్న ప్రజా ఉద్యమ పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు.రాష్ట్ర నాయకుడు కొమ్ముల ప్రవీణ్ రాజ్ మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు.గ్రామ స్థాయి నుంచి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజల మద్దతుతో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.సభ్యత్వం స్వీకరించిన శ్రీనివాస్ రాంటెంకి మాట్లాడుతూ. ..తీన్మార్ మల్లన్న నాయకత్వం,పార్టీ ప్రజా సంక్షేమ లక్ష్యాలకు ఆకర్షితుడై తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరినట్లు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీతో కలిసి కృషి చేస్తానని,ప్రజలకు అందుబాటులో



ఉంటూ వారి అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శ్రీనివాస్ రాంటెంకికి శుభాకాంక్షలు తెలిపారు.

# న్యాయం చేయండి సిపి సునీల్ దత్ సారు..

సిపి ముందు గిరిజన మహిళ ఆవేదన..
మీటింగ్ లో ఉన్న మహిళ ఫిర్యాదును స్పందించిన జిల్లా సిపి..

**కారేపల్లి,మే23(సూర్యరేఖ)** గిరిజన మహిళపై ర్యాగింగ్ కు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే రిమాండ్ చేయాలని ఏసిపికి ఆదేశాలు జారీ చేసినట్లు బాధితులు తెలిపారు.పచ్చిపాల వెంకట్ అరాచకాలకు ఇప్పటికైనా పోలీసు అధికారులు చెక్ పెడతారా చూడాల్సి ఉంది.కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి ఆలియా తండాలో ఓగిరిజన మహిళపై జరిగిన వేధింపుల ఘటన కలకలం రేపుతోంది.బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ నకిలీ విలేఖరిగా తిరుగుతున్న పచ్చిపాల వెంకట్,అతని అనుచరులు కలిసి తనను ర్యాగింగ్ చేస్తూ అసభ్య పదజాలంతో వేధించారని బాధితురాలు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది.తాను ఒంటరిగా వెళ్తున్న సమయంలో మద్యం మత్తులో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేశారని బాధితురాలు ఎస్పీ ఎదుట కన్నీటి పర్యంతమైంది.పదో తరగతి అర్హత కూడా లేని వ్యక్తి విలేఖరి పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటూ మహిళలను వేధించడం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఈ ఘటనపై కఠిన సెక్షన్లు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని బాధితురాలు డిమాండ్ చేసింది.అయితే మహిళను వేధించిన పచ్చిపాల వెంకట్ ను రక్షించేందుకు జిల్లాలోని ఓ మంత్రి కారేపల్లికి చెందిన ప్రధాన అనుచరుడు పోలీసులపై ఒత్తిడి తీసుకొస్తున్నాడని ఆమె ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లడం మరింత చర్చనీయాంశమైంది. “తమకు న్యాయం జరగకపోతే ఎస్టీ--ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయిస్తాం”అని బాధితురాలు సిపికి తెలిపింది.స్థానికులంగా స్పందించిన సిపి వెంటనే వేధించి అసభ్యకరంగా వ్యవహరించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని రిమాండ్ కు తరలించాలని ఏసిపికి ఆదేశాలు జారీ చేసినట్లు బాధితురాలు తెలిపింది.మహిళల భద్రతపై పెద్దఎత్తున ప్రచారం చేస్తున్న సమయంలో






ఇలాంటి ఘటనలపై పోలీసులు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ను కలిసిన

గ్రీన్ పీస్ ఎన్విరాన్మెంట్,వాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అధ్యక్షులు బైరి శ్రీనివాస్ గౌడ్



**ఉప్పల్,మే23(సూర్యరేఖ)** కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ యువ నాయకులు, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్ ని న్యూఎమ్మెల్యే క్వార్టర్స్ లోని వారి కార్యాలయంలో గ్రీన్ పీస్ ఎన్విరాన్‌మె ంట్‌డవాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ...ప్రస్తుత పరిస్థితుల్లో పచ్చదనం చాలా అవసరం అని,వనమహోత్సవంలో మనం భాగ్యసౌములై మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుంటే రాబోవు తరాలకి అవి ప్రగతికి పునాది అవుతుందని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ కోసం బైరి శ్రీనివాస్ గౌడ్ చేస్తున్న కృషిని రాజ్యసభ సభ్యులు అభినందించారు.

## రామయంపేటలో విషాదం..బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేతల అండ



**రామాయంపేట,మే23(సూర్యరేఖ)** రామయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన మద్దూరి వీరయ్య అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు,నాయకులు వెంటనే వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రూ.5,000ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండదండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గాజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ...“వీరయ్య మరణం బాధాకరం. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుంది”అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు,6వ వార్డు కౌన్సిలర్ పుట్టి సందీప్,3వ వార్డు కౌన్సిలర్ గుగులోత్ రవి,9వ వార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్,డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాదగిరి కార్యదర్శి పోచమ్మల గణేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాకి స్వామి పాల్గొన్నారు.అలాగే యూత్ నాయకులు మోబిన్, పోచమ్మల భాను,చిలుక విరాట్,సుధీర్ గౌడ్,అక్కల నరేందర్, సోహెల్,దేవుని నరేష్‌తో పాటు 6వ వార్డు రజక సంఘం నాయకులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై మద్దూరి వీరయ్యకి నివాళులర్పించారు.

## శ్రీమురళీ మెమోరియల్ క్రికెట్ అకాడమీ నూతన వేదికను ప్రారంభించనున్న ఎమ్మెల్యే





**బెల్లంపల్లి,మే23(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో శ్రీమురళీ మెమోరియల్ క్రికెటర్ అకాడమీ నూతన వేదికను బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ సోమవారం ప్రారంభించనున్నారు.గత సంవత్సరం కాలం నుండి ఈ అకాడమీని బెల్లంపల్లిలో నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుత స్థలం ఇరుకుగా ఉండడంతో నూతన స్థలాన్ని ఎంపిక చేసుకొని ఈ అకాడమీలో శిక్షణ పొందే క్రీడాకారులకు మంచి సౌకర్యాలను కల్పించడానికి నిర్వాహకులు నిర్ణయించారు. గతంలో నిర్వహించిన పాత స్థలంలో అనేకమంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన అకాడమీ వారు వివిధ ప్రాంతాలలో జరిగే టోర్నమెంట్లలో కూడా విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి ఈ ప్రాంతానికి పేరు తీసుకువచ్చేలా ప్రయత్నించారు.ప్రస్తుతం నూతనంగా ఏర్పాటు చేస్తున్న అకాడమీ వేదిక చాలా విశాలంగా ఉండడంతో క్రీడాకారులు మంచి శిక్షణ పొందడానికి అవకాశం ఏర్పడింది.ఈ వేదికను ఎమ్మెల్యే ప్రారంభించే సమయంలో పట్టణంలోని పలువురు ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని క్రికెట్ అకాడమీ నిర్వాహకులు అల్లం వెంకటేశ్వర్లు తెలిపారు.

# ధాన్యం నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి..






కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి,మే23(సూర్యరేఖ)** కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం సురక్షితంగా నిల్వ చేసి,వేగంగా తరలించే చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును సబ్ కలెక్టర్ మనోజ్,తహసీల్దార్ కృష్ణలతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మద్దతు ధరతో నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యం వర్షాలు,ఇతర కారణాలతో దెబ్బతినకుండా గోదాములు,రైస్ మిల్లులకు సకాలంలో తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.గోదాములకు చేరే ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసి,శాస్త్రీయ పద్ధతుల్లో నిల్వ చేయాలని ఆదేశించారు. అవసరమైన అనుమతులు పొంది ఈ భవనాలను ధాన్యం నిల్వ కోసం వినియోగించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే ఆర్ అండ్ ఆర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను కాసిపేట తహసీల్దార్ సునీల్ దేశ్‌పాండేతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం భీమారం మండలంలోని సమత రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్,కొనుగోలు కేంద్రాల నుంచి తరలించిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. రైస్ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్ తాసిల్దార్ కృష్ణ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బండ మాదారంలో వైభవంగా పెద్దమ్మ తల్లి,బొడ్రాయి పండుగ





**మేడ్చల్,మే23(సూర్యరేఖ)** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని బండ మాదారం గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి,బొడ్రాయి పండుగ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామీణ సంస్కృతి,సాంప్రదాయాలు ఉట్టిపడేలా గ్రామస్తులంతా కలిసి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.?ఈ ఆధ్యాత్మిక మహోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎంపీ ఈటల రాజేందర్,ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు పెద్దమ్మ తల్లి,బొడ్రాయి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకులు,ఆలయ కమిటీ నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి,వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ...గ్రామ ప్రజలంతా, ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ ...గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందేలా,ప్రజలందరినీ ఏకం చేసే ఇలాంటి సాంప్రదాయ పండుగలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు.?ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,బండ మాదారం గ్రామ ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ రీజియన్ లో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలు..





**రాజేంద్రనగర్,మే23(సూర్యరేఖ)**ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో బాగంగా హైదరాబాద్ రీజియన్ పరిధిలోని14ఆర్టీసీ బస్సు డిపోలకు చెందిన154మంది క్రీడా కారులకు శనివారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయవిశ్వవిద్యాలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో క్రీడా పోటీలను నిర్వహించారు.ఈ పోటీలను హైదరాబాద్ రీజినల్ మేనేజరు సుధ పరిమళ పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. పురుషులకు,స్త్రీలకు100మీటర్ల పరుగు పందెం,షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు స్త్రీ పురుషుల కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మ్యూజికల్ చైర్ పోటీలు కేవలం మహిళా సిబ్బంది కోసం ఆడిపిస్తున్నామన్నారు.నిత్యం బిజిగా ఉండే ఆర్టీసీ సిబ్బంది జీవితాలలో ఆనందం,సంతోషాన్ని నింపడానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచనలతో ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు.ఆర్టీసీ సిబ్బంది అవసరమున్న సమయంలో వాకింగ్ చేయడం



మంచిదన్నారు.14డిపోల నుంచి వచ్చిన ఆర్టీసీ సిబ్బంది ఒకే వేదికపై క్రీడా పోటీలలో పాల్గొనడం సంతోషకరమైన విషయం అన్నారు. క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజరు మాధవి,రాజేంద్రనగర్, బర్కత్ పుర,ఫారుఖ్ నగర్,మెహిదీపట్నం,హయత్ నగర్,ఆర్టీసీ బస్సు డిపోల మేనేజర్లు బి.క్రిష్ణారెడ్డి, మంజుల,వేదవతి,క్రిష్ణమూర్తి,శ్రీనివాస్,ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ రీజినల్ పర్సనల్ ఆఫీసర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం..మట్టి,ఇసుక తరలిస్తే ఉపేక్షించేది లేదు

తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ




**మందమర్రి,మే23(సూర్యరేఖ)** అనుమతులు లేకుండా మట్టి,ఇసుక తరలించినా, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణం చేపట్టినా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని మండల తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ స్పష్టం చేశారు .పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో గల సింగరేణి ఆసుపత్రి వెనకాల గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని గుర్తించి, శనివారం నిర్మాణ పనులను రెవెన్యూ సిబ్బంది ఆపివేయడం జరిగినది. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ మాట్లాడుతూ...ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో నిర్మాణం చేపడితే సహించేది లేదని స్పష్టం చేశారు.ఇటీవల వెలువడిన వరుస కథనాల నేపద్యంలో రెవెన్యూ,పోలీసు సిబ్బందితో కలిసి సంయు క్తంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.అలాగే మండలంలో అక్రమ మట్టి,ఇసుక తరలించినా,ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే వెంటనే చట్టరీత్యా చర్యలు చేపట్టాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి అదేశాలు జారీ చేశామని తెలిపారు.ఇటీవల అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు లారీలను స్వాధీన పరచుకుని జరిమానా(ఫెనాల్టి)విధింపు కొరకు జిల్లా గనులుడ భూగర్భశాస్త్రశాఖ ఏడీకి పంపడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్య చర్యలు చేపడతామని ఈ సందర్భంగా తహసిల్దార్ హెచ్చరించారు.ఈ తనిఖీల్లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాథోడ్ గణపతి,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## టీజీ పాలిసెట్ పరీక్షలో స్టేట్ ర్యాంక్ సాధించిన ఆల్వియా సిఫాలి



**జన్నారం,,మే23(సూర్యరేఖ)**ంశనివారం విడుదలైన టీజీ పాలిసెట్ పరీక్షలో జన్నారం మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని ఆల్వియా సిఫాలి120/120 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకర్ గా నిలిచింది.గతంలో మండల కేంద్రంలో గల ప్రైవేట్ స్లేట్ హైస్కూల్ పాఠశాలలో పదవ తరగతి 600మార్కులకు గాను 583 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచిందని ఆ పాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు పాలిసెట్ పరీక్షలో స్టేట్ ర్యాంక్ సాధించడంతో ఆపాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి సిబిఎస్సి పాఠశాల ప్రిన్సిపాల్ శీరిన్ ఉపాధ్యాయులు కృష్ణ,జాకీర్,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## రైతులకు భరోసా..ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి,మే23(సూర్యరేఖ)** బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి,జిల్లా అదనపు కలెక్టర్ మనోజ్ కుమార్,తహసిల్దార్ కృష్ణ,సంబంధిత అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న వడ్ల సేకరణ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వడ్ల కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,ప్రభుత్వం రైతులు తీసుకొచ్చిన ప్రతి గింజను కొనుగోలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే,రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో అన్ని వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు.ముఖ్యంగా వడ్ల తరలింపునకు అవసరమైన లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని, సంచుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు రైతులు పరస్పరం సమన్వయంతో వ్యవహరిస్తూ అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కోరారు.ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని,రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# ఆదిమ గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం జనభాగీదారి అభియాన్





**జైనూర్,మే23(సూర్యరేఖ)** పీఎం జన్ మన్ కార్యక్రమం ద్వారా ఆదిమ గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం జనభాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ రమాదేవి తెలిపారు.ఈ పథకాన్ని ఆదిమ గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమం ద్వారా వ్యక్తిగత మరియు సామూహిక అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.శనివారం జైనూర్ మండలం రాసిమెట్ట గ్రామపంచాయతీ మంగూగూడ గ్రామంలో జనభాగీదారి అభియాన్ కార్యక్రమాలు నిర్వహించ డం జరిగింది అన్నారు.ఈ సందర్భంగా గ్రామ స్థులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.అర్హులైన లబ్ధిదా రులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సూచనలు చేసారు. కార్యక్రమంలో ఏటీడిఓ,ఎస్సిఆర్పి ఉయిక శంకర్, చౌహాన్ రవీందర్,ఉపాధ్యాయులు విజేంద ర్, ఉత్తమ్,భీంరావ్ సాంబాజీ,గ్రామస్తులు తదితరు లు పాల్గొన్నారు.

# ప్రపంచ విత్తన రంగానికి తెలంగాణ మెలకువలు..





ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ దండ రాజిరెడ్డి

**సిద్దిపేట జిల్లా,మే23(సూర్యరేఖ)** ప్రపంచానికి విత్తన రంగంలో పాఠాలు నేర్పిన తెలంగాణ రాష్ట్రం మోడల్గా ఆఫ్రికా దేశాలు విత్తన రంగంలో ప్రగతి సాధించవచ్చని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. ప్రత్యేకించి కూరగాయ లు విత్తన ఉత్పత్తిలో విశ్వవిద్యాలయం సాంకేతి కతో ఎన్నో విజయాలు సాధించినట్లు ఆయన తెలిపారు.సిద్దిపేట జిల్లా ములుగులో ఉద్యాన యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో "విత్తన అవగాహన,పరిశ్రమ అభివృద్ధి"అనే అంశంపై ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్, తరాబా ,ప్రసాద్ సీడ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.450పైగా జాతీయ,అంతర్జాతీయ విత్తన కంపెనీలతో లక్షల పైగా ఎకరాలలో విత్తన పంటలు పండిస్తూ, తెలంగాణ ఇప్పటికే 'ప్రపంచ విత్తన రాజధానిగా పేరుపొందిందని రాజిరెడ్డి తెలిపారు.ఆఫ్రికా దేశాలకు కూరగాయ విత్తన ఉత్పత్తిలో సూచన, సలహాలు ఇచ్చేందుకు వర్సిటీ సిద్ధంగా ఉంద న్నారు. సేంద్రియ విత్తన ధృవీకరణకు అవకాశాలు ఆఫ్రికాలో మెండుగా ఉన్నాయని తెలిపారు. అయితే ఇప్పుడిప్పుడే వ్యవసాయ అభివృద్ధి చెందుతున్న ఆఫ్రికా దేశాలు అధిక ఎరువుల వాడకం,అధిక పురుగుమందుల వాడకం, అలాగే భూమిని పాడు చేయడం వంటి పద్ధతులు జోలికి పోకుండా ఉండాలని ఆయన కోరారు. ఉద్యాన పంటల్లో మేలైన విత్తన ఉత్పత్తికి కావాల్సిన శిక్షణ తీసుకునేందుకు ఆఫ్రికా దేశాల నుంచి పరిశోధకులు,విద్యార్థులు తెలంగాణలోని ఉద్యాన విశ్వవిద్యాలయానికి వచ్చి నేర్చుకోనేందుకు వీలు కల్పించనున్నట్లు తెలిపారు.ప్రత్యేకించి సూటిరకాల కూరగాయల పంటలలో విత్తన ఉత్పత్తి సులభమని, వెంటనే ఆఫ్రికాలో వీటిల్లో ఇతను ఉత్పత్తి అవకాశాలు అనేకమని అన్నారు. నైజీరియాలోని తరాభా డైరెక్టర్ డైరెక్టర్ జనరల్ జోషువా మార్క్ మాకు,వ్యవసాయశాఖ పర్మినెంట్ సెక్రెటరీ అలీ సారా సాబుదంజుమాతో పాటు30 మంది నైజీరియా దేశస్తులు ఈశిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కారుతో ఢీకొట్టి న్యాయవాదిపై దాడి,చికిత్స పొందుతూ మృతి..



**నాంపల్లి,హైదరాబాద్,మే23 (సూర్యరేఖ)** హైదరాబాద్ నగర నడిబొడ్డు మాసాబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్యాయత్నం కలకలం రేపింది.ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టగా,తీవ్రంగా గాయపడిన మొయినుద్దీన్ ను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగ ఆయన పరిస్థితి విషమంగా ఉండి చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డ య్యాయి.కేసు నమోదు చేసిన పోలీసులు దుండగుల కోసం గాలిస్తు న్నారు.వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం పోరాడుతున్న నేపథ్యంలోనే న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**ఖాజా మోహిజుద్దీన్ హత్యపై కుమారుడు ఫర్హాన్ స్పందన...**

ఈ సందర్భంగా ఖాజా మోహిజుద్దీన్ హత్యపై కుమారుడు ఫర్హాన్ మాట్లాడుతూ..మా తండ్రి హత్యకు కాంగ్రెస్ నాయకుడు ఆలంఖాన్




కారణమని ఆరోపించారు.తన తండ్రి వక్ఫ్ బోర్డు ఆస్తులు కాపాడేందుకు కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాడని తెలిపారు.వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆలం ఖాన్,అతడి తండ్రి ఆక్రమించి కాలేజీలు నిర్మించారని ఈ క్రమంలోనే వాటి గురించి ఎప్పటి నుండో కేసులు వేస్తూ మా నాన ఖాజా మోహిజుద్దీన్ పోరాటం చేస్తున్నారని గుర్తు చేసారు.గత ఆరు నెలల క్రితం అలంఖాన్ మా ఆఫీసుకు వచ్చి నన్ను బెదిరించాడని,గతంలో మా ఆఫీసులకు వచ్చి మరి పలుమార్లు దాడులు చేశారన్నారు.మా తండ్రిపై దాడి జరగడం ఇది ఆరవసార అని తెలిపారు.ఇప్పుడు నాకు,మా కుటుంబానికి కానీ ఏం జరిగినా పూర్తి భాద్యత ఆలం ఖాన్ దే నాని పేర్కొంటూ..ప్రభుత్వం నాకు,నా కుటుంబానికి రక్షణ కలిపించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రికి,పోలీస్ శాఖ కోరుతున్నానని పేర్కొన్నారు.

## చలో హైదరాబాద్ కార్యక్రమం కరపత్రాలు ఆవిష్కరణ..

**బీర్పూర్,మే23(సూర్యరేఖ)** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న ఆదివాసి గిరిజన గిరిజననేతరులు సాగు చేస్తున్న పోడు భూములకు అటవీ హక్కుపత్రాలు కల్పించాలని శనివారం మండల కేంద్రంలోని చలో హైదరాబాద్ ఇంద్రపార్క్ దగ్గర నిర్వహించే భారీ ప్రదర్శనకు జయప్రదం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమానికి ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి ఈధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు గోపి చంద్రయ్య,రైతులు పాల్గొన్నారు.



## తెలంగాణ పోలీస్ బాస్ డీజిపి సి.వి.ఆనంద్ ను సత్కరించిన దేవర వంశీ



**నాంపల్లి,హైదరాబాద్,మే23(సూర్యరేఖ)** తెలంగాణ ప్రభుత్వానికి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసి,పదోన్నతిపై తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజిపి)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి.ఆనంద్ బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్బంగా తెలంగాణ పోలీస్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డీజీపీ సి.వి.ఆనంద్ ను భాజపా యువ నాయకుడు,సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షులు దేవర వంశీ మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి,అభినందనలు తెలియజేసారు. ఈ సందర్బంగా వంశీ మాట్లాడుతూ..నిష్పక్షపాతంగా ప్రభుత్వ శాఖలో వినీతిపరులను,సమాజంలో సంఘ విద్రోహులపై నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలిని కోరారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మొక్కను అందజేసే జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

బైరి శ్రీనివాస్ గౌడ్



**ఉప్పల్,మే23(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమట రిరెడ్డి వెంకట్ రెడ్డి జన్మదినం సందర్బంగా కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నివాసంలో శనివారం గ్రీన్ పీస్ ఎన్విరాన్మెంట్ వాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ గౌడ్ వన మహోత్సవం మొక్కను బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గోమాతను రక్షించడం ఓ హిందూవుగా మన అందరి బాధ్యత..

గుర్రం శివశంకర్



**నాంపల్లి,హైదరాబాద్,మే23(సూర్యరేఖ)**అక్రమంగా తరలిస్తున్న గోవులను రక్షించిన గోవు సంరక్షణ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ,వారిని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జియాగూడ డివిజన్ బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం శివశంకర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా గుర్రం శివశంకర్ మాట్లాడుతూ. ..గోవులను రక్షించిన గోవు సంరక్షణ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి,అరెస్ట్ చేసిన కార్యకర్తలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని,హిందూ సాంప్రదాయాలను అవమానించడం కాకుండా గౌరవించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారి ప్రధాన డిమాండ్లు వివరిస్తూ..గోవులను హింసించడం ఆపాలని,అక్రమంగా అరెస్టయిన గో కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని,తెలంగాణలో గోవుల అక్రమ రవాణా,వాటి వధను అరికట్టాలనే డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామని గుర్రం శివశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ కు సాంగ్వి సర్పంచ్ ఆత్రం నగేష్ అత్మియ సన్మానం..



**సత్నాల,23మే( సూర్యరేఖ)** సాత్నల మండలం సాంగ్వి సర్పంచ్ అత్రం నగేష్ తుడుందేబ్బ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా గోడం గణేష్ కు రాష్ట్ర కమిటీ సబ్బిలు వేట్టి మనోజ్,గ్రామ పటేల్ గ్రామ ప్రజలు సన్మానం చేసారు.ఈ సందర్భంగా గోడం గణేష్ మాట్లాడుతూ...అదివాసి హక్కుల కోసం సంస్కృతి సాంప్రదాయలు కాపాడుకోవాడాని తుడందెబ్బ నిరంతరం సాయశక్తుల పని చేస్తుంది. మన సంస్కృతి చాల గొప్పది.దానికి ముందు తరలకు అందిచడం మన అందరి బాధ్యత అన్నారు. గ్రామ యువత మేలకోని ప్రతీ విషయం సున్నితంగా అలిచించి నుతన సర్పంచ్ గేలచిన నవ యువకులు నగేష్ తో సమన్వయం చేసి గ్రామ అభివృద్ధి తోడ్పాటు అందించాలన్నారు.అదివాసి యువత ఉన్నత చదువు వైపు వెళ్లాలని,ఎన్ని కష్ట నష్టాలు వచ్చన చదువు ఆపొద్దని, ప్రభుత్వం మనకు అందిస్తున్న వివిధ విద్యబోదన సద్వినియోగం సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ ఏర్మ విఠల్,గ్రామ పెద్దలు ఉయిక రమేష్,లాల్ షావ్, మెస్రం లక్ష్మణ్, ఏర్మ చిత్రు,వేడమ కేశవ్,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలి..



జీఎం ఎన్.రాధాకృష్ణ



కాసిపేట-1ఇన్‌క్లైన్ గనిపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు

**మందమర్రి,మే22(సూర్యరేఖ)**సింగరేణి సంస్థ అభివృద్ధికి నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ఎంతో కీలకమని,నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పేర్కొన్నారు.సింగరేణి సిఎండి డా.బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు శనివారం కాసిపేట-1 ఇన్‌క్లైన్ భూగర్భగనిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు నిర్వహించారు.గనిలోని మూడు షిఫ్ట్‌ల ఉద్యోగులతో విడివిడిగా జరిగిన ఈ సమావేశాలలో అధికారులు ఉత్పత్తి,రక్షణ,సంక్షేమం,నాణ్యత నియంత్రణ అంశాలపై సమగ్రంగా చర్చించారు. భూగర్భగనుల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ రక్షణ ప్రమాణాలను పాటించడం ద్వారా మాత్రమే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని జీఎం స్పష్టం చేశారు.కాసిపేట-1గని మందమర్రి ఏరియాకు ముఖ్యమైన ఆర్థిక వనరుగా నిలుస్తోందని,ఇక్కడి ఉద్యోగుల క్రమశిక్షణ,అంకితభావం సంస్థకు మంచి పేరు తీసుకొస్తోందని ఆయన తెలిపారు.అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగిస్తూ ఉత్పాదకతను మరింత పెంచాలని సూచించారు.ఈ సమావేశంలో ఉద్యోగుల సంక్షేమ పథకాలు,ఫైనాన్స్ సంబంధిత అంశాలు,భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు,సంస్థ లక్ష్యాలపై అధికారులు అవగాహన కల్పించారు. బొగ్గు నాణ్యత విషయంలో రాజీ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కాసిపేట-1 గని బొగ్గుకు మార్కెట్లో ఉన్న మంచి గుర్తింపును నిలబెట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం జి.ఎల్.ప్రసాద్,ఏఐటీయూసీ నాయకుడు దాగం మల్లేష్,కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు,ఏజీఎం ఆర్.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, డీజీఎంలు అశోక్,కిరణ్ కుమార్,క్వాలిటీ ఇంచార్జ్ ప్రదీప్,గని మేనేజర్ సతీష్,సంక్షేమ అధికారి గౌస్ జీషాన్ తదితర అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి..



సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి



**మందమర్రి,మే 23(సూర్యరేఖ)**రానున్న వర్షాకాలంలో నేపద్యంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని ఏరియాల జిఎంలకు సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సూచించారు.నైరుతి రుతుపవనాలు మరో పది రోజుల్లో ప్రవేశించే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో వర్షాకాలంలోనూ బొగ్గు ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగేందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా కొనసాగించాల్సిన అవసరం ఉన్నందున అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.సింగరేణి సంస్థలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న బొగ్గులో సుమారు95 శాతం ఓపెన్‌కాస్ట్ గనుల నుంచే వస్తోందని,భారీ వర్షాల సమయంలో గనుల్లో నీరు నిల్వవడం వల్ల ఉత్పత్తికి ఆటంకం కలుగుతుందని సమావేశంలో చర్చించారు.ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఇప్పటికే అన్ని ఓపెన్‌కాస్ట్ గనుల్లో వందకు పైగా భారీ పంపులు,మోటార్లు ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపుతున్నట్లు అధికారులు వివరించారు.అయితే రానున్న రోజుల్లో భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున కంపెనీ పంపులతో పాటు అవసరమైతే ప్రైవేటు పంపులను కూడా వినియోగించాలని సీఎండీ ఆదేశించారు.ఓవర్‌బర్డెన్,బొగ్గు బెంచీల వద్ద నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు హాల్ రోడ్లను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. అవసరమైన పంపుల కొనుగోలుకు టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని కార్పొరేట్ కార్యాలయ అధికారులకు సూచించారు.గత రెండేళ్లలో వర్షాల కారణంగా తీవ్ర ఉత్పత్తి నష్టాన్ని చవిచూసిన ఉపరితల గనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు.అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సాధించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులపై సమీక్ష నిర్వహించారు.వర్షాకాలం ప్రారంభానికి ముందే గరిష్ట స్థాయిలో బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని ఆయన ఆదేశించారు. కొన్ని ప్రధాన ఓపెన్‌కాస్ట్ గనులు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోవడానికి గల కారణాలపై కూడా లోతుగా చర్చించారు.ఈ సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్ అండ్ ఫైనాన్స్ గౌతమ్ పోట్రు, డైరెక్టర్ ఈ అండ్ ఎం ఎం.తిరుమలరావు, ఈడీ(కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జీఎం(కోఆర్డినేషన్&మార్కెటింగ్)టి.శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్



**కారేపల్లి,మే23(సూర్యరేఖ)** భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన గుగులోత్ భూలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది.ఈ విషయం తెలుసుకున్న వెంటనే యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మృతురాలి కుటుంబం ప్రస్తుతం ఆర్థిక మరియు మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారి దశదిన కార్యక్రమానికి తన వంతు సహాయంగా 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. కష్టసమయంలో కుటుంబానికి అండగా నిలబడటం మన సామాజిక బాధ్యత అని హర్ష నాయక్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా గుగులోత్ హర్ష నాయక్ మాట్లాడుతూ..."ప్రజలు సంతోషంలో ఉన్నప్పుడు మాత్రమే కాదు,కష్టాల్లో ఉన్నప్పుడు కూడా వారి వెంట నిలబడటం నిజమైన సేవ. గ్రామ ప్రజల సుఖదుఃఖాల్లో నేను ఎల్లప్పుడూ ముందుంటాను.బాధిత కుటుంబానికి నా సహకారం ఎప్పటికీ ఉంటుంది"అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుగులోత్ హరిదాస్,గుగులోత్ భిఖ్య,గుగులోత్ బావుసింగ్,గుగులోత్ దస్రు,గుగులోత్ లక్ష్మణ్,గుగులోత్ కిషన్,గుగులోత్ వీరన్న,గుగులోత్ కుమార్, బద్రు, బాల, 10వ వార్డు సభ్యులు గుగులోత్ జ్యోతిరాములు,7వ వార్డు సభ్యుడు మహేష్, యువ నాయకులు మోహన్,తరుణ్,సాయి,సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రక కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది..

ఐటీడీఏ పీవో మంద మకరంద్



**ఉట్నూర్,మే23(సూర్యరేఖ)** చారిత్రక కట్టలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐటీడీఏ పీవో మంద మకరంద్ అన్నారు.అనంతరం ఆయన ఉట్నూరు మండలంలోని గొండు రాజుల కోటను సందర్శించి పరిసరాలను పరిశీలించారు.సుమారు 700ఏళ్ల క్రితం అప్పటి రాజులు నిర్మించాలని ఆకార్లకు వైజ్ఞానాన్ని తెలియజేస్తున్న చరిత్రక వారసత్వానికి ప్రతి కారంగా నిలిచింది ఈ కోటను భవిష్యత్తు తరాలకు అందించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కాపాడుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాదవ్ అనిత శ్రీనివాస్ ఏపీవో జాదవ్ వసంతరావు ఐటిడిఏ ఈఈ జాదవ్ తానాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 26న తై బజార్ వేలం..



**జల్ పల్లి,మే23(సూర్యరేఖ)** జిహెచ్ఎంసి జల్ పల్లి సర్కిల్ కార్యాలయం లో ఈనెల 26న తై బజార్ వేలం నిర్వహిస్తున్నట్టు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.వెంకట్రామ్ ఓ ప్రకటనలో తెలిపారు.జల్ పల్లి సర్కిల్ కు సంబంధించి 2026-27ఆర్థిక సంవత్సరానికి గాను వేలం పాట నిర్వహిస్తున్నామని,ఆసక్తిగల వారు తైబజార్ కు సంబంధించిన వివరాలను జల్ పల్లి సర్కిల్ కార్యాలయంలో సంప్రదించి, తెలుసుకోవాలని కోరారు.తైబజార్ వేలం పాటలో పాల్గొనే వారు రూ:1లక్ష డి.డి కమిషనర్ జిహెచ్ఎంసి హైదరాబాద్ పేరు మీద కట్టి,అనంతరం పేరు నమోదు చేసుకున్న వారు మాత్రమే వేలం పాటలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు.ఈ వేలం పాటలో ఎక్కువ మొత్తంలో ఎవరు పాడితే వారికే తైబజార్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.తై బజార్ వేలంలో ఎక్కువ ఎవరు పాడిన,డబ్బులను అప్పుడే చెల్లించాల్సి ఉంటుందని డిసి పేర్కొన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిపై సంవత్సరం పాటు తైబజార్ దక్కించుకున్న వ్యక్తులు 2026నుండి 2027జూన్ వరకు ఏడాదిపాటు సంతలో వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేసుకోవచ్చన్నారు.మరిన్ని వివరాలకు జల్ పల్లి సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## అక్కన్నపేట పెద్దమ్మ జాతరలో..హాజరైన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి

అమ్మవారికి మొక్కులు చెల్లింపు.





**రామాయంపేట,మే23(సూర్యరేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట పెద్దమ్మ జాతరకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరయ్యారు.శనివారం రాత్రి జరిగిన ఉత్సవాల ముగింపులో ఎమ్మెల్యే చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు.దీంతో పాటుగా నల్ల పోచమ్మ ఆలయంలోనూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఝాన్సీలింగాపూర్ గ్రామ సర్పంచ్ మానేగళ్ళ రామకృష్ణయ్య ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు.ఎమ్మెల్యే రోహిత్ వెంట రామాయంపేట కౌన్సిలర్ గజవాడ నాగరాజు,చంద్ర బోస్,చింతలస్వామి, నాగులు, కుమార్ సాగర్ లో ఉన్నారు.

# మందమర్రిలో గంజాయి నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక ఆపరేషన్..





మత్తు సమాజ రహితమే లక్ష్యం..

సిఐ పర్స రమేష్

**మందమర్రి,మే23(సూర్యరేఖ)** మందమర్రి పట్టణం,పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు,వినియోగం పెరగకుండా కట్టడి చేయడానికి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్స రమేష్ సారథ్యంలో ఎస్సై గోపతి నరేష్ తో పాటు పోలీసు సిబ్బంది శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ ప్రత్యేక తనిఖీలలో భాగంగా డాగ్ స్క్వాడ్ (జాగిలాల బృందం),క్లూస్ టీం సహకారంతో అనుమానాస్పద ప్రాంతాలు ,కాలనీలు, నిర్మానుష్య ప్రదేశాలు,యువత ఎక్కువగా గుమికూడే ప్రాంతాలు,రైల్వే ట్రాక్ పరిసరాలు, బస్టాండ్ ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు.ఎక్కడైనా గంజాయి నిల్వలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నాయా అనే కోణంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.పోలీసుల ఆకస్మిక తనిఖీలతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిలో ఆందోళన నెలకొంది.గంజాయి విక్రయాలు, వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటోందని భావిస్తున్న పోలీసులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తరచూ ప్రత్యేక దాడులు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ పర్స రమేష్ మాట్లాడుతూ... మందమర్రి ప్రాంతాన్ని మత్తు పదార్థాల రహిత ప్రాంతంగా మార్చేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.ప్రజల భద్రత,యువత భవిష్యత్తు దృష్ట్యా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అంతేకాకుం డా, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తెలిసినా, అనుమానా స్పద వ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని కోరారు.

## రామాయంపేట మున్సిపాలిటీకి కోట్ల నష్టం..?

13షటర్లపై అధికారుల నిర్లక్ష్యం..

ప్రజాధనంపై రాజకీయాల నీడ.!

“రీ-టెండర్ చేయకపోతే దుకాణాల మూసివేతతో భారీ ఉద్యమం”..

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు



**రామాయంపేట,మే23 (సూర్యరేఖ)** ప్రజల అభివృద్ధికి ఉపయోగపడాల్సిన కోట్ల రూపాయల ఆదాయం కొందరి స్వార్థ రాజకీయాల బలి పీఠంపై పడిపోయిందా.?మున్సిపాలిటీకి బంగారు గని లాంటి 13షటర్లు కొందరి ప్రయోజనాల కోసం మూసివేత నీడలోనే కొనసాగుతున్నాయా.? అనే ప్రశ్నలు ఇప్పుడు రామాయంపేట ప్రజలను కలచివేస్తున్నాయి.లీజు గడువు పూర్తయి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రీ-టెండర్ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో మున్సిపాలిటీ ఖజానాకు మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొనడంపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం రామాయంపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మండిపడుతూ...“తూప్రాన్‌లో దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్న అదే కమిషనర్, రామాయంపేట విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారు.?ఇక్కడ వేరే నియమాలా.?”అంటూ ప్రశ్నించారు.గతంలో లీజుకు తీసుకున్న కొందరు దుకాణదారులతో కుమ్మక్కై,స్వార్థ రాజకీయ నాయకుల ఒత్తిడికి లోనై మున్సిపల్ అధికారులు ఉద్దేశపూర్వకంగానే రీ-టెండర్ ప్రక్రియను నిలిపివేస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.“ప్రజల డబ్బు అంటే అధికారులకు విలువ లేదా.? కోట్ల రూపాయల ఆదాయం వస్తుంటే దాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారు.?”అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.రామాయంపేట అభివృద్ధికి ఉపయోగపడే నిధులు అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతున్నాయని ఆవేదన చెందిన రాగి రాములు “ఈ ఆదాయంతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు,వీధి దీపాలు,ప్రజా సౌకర్యాలు మెరుగుపడేవి.కానీ ప్రజల భవిష్యత్తును కొందరి లాభాల కోసం తాకట్టు పెడుతున్నారు”అంటూ గుండె ముక్కలయ్యేలా వ్యాఖ్యానించారు.వెంటనే రీ-టెండర్ ప్రక్రియ ప్రారంభించి బహిరంగ వేలం నిర్వహించాలని డిమాండ్ చేసిన ఆయన,లేకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే అన్ని షటర్లను మూసివేసి,రీ-టెండర్ పూర్తయ్యే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. “రామాయంపేట అభివృద్ధి కోసం వచ్చే కోట్ల ఆదాయాన్ని కాపాడాలి...స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలి” అని ఆయన సూచించారు.చైర్మన్,మున్సిపల్ కమిషనర్,అధికార యంత్రాంగం వెంటనే స్పందించి రీ-టెండర్ ప్రక్రియ పూర్తి చేసి,వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు ప్రారంభించాలని రాగి రాములు డిమాండ్ చేశారు.

## జల్ పల్లి,మే23(సూర్యరేఖ)



బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో వచ్చే నెలలో చేపట్టే పాదయాత్రకు ముందు బాలాపూర్ లోని అతి పురాతన మైన దర్గాలో ప్రార్థనలు చేసి ప్రారంభించాలని శనివారం తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును బాలాపూర్ రౌషనుదౌల,కాలనీ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు మొహమ్మద్ జమీర్,లు ఆహ్వానించారు.

## నేటితో విజయవంతంగా ముగిసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం..

ఆరు సాగు సంబంధిత అంశాలపై సుమారు రెండున్నర లక్షల మంది రైతులకు అవగాహన..



**రాజేంద్రనగర్,మే23(సూర్యరేఖ)**వ్యవసాయశాఖ సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏప్రిల్ 27వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం శనివారంతో విజయవంతంగా ముగిసింది.99రోజుల ప్రజాపాలన - ప్రగతిప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రివర్యులు శ్రీతుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం రైతు వేదిక ద్వారా ఏప్రిల్ 27వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు.నాలుగు వారాలుగా 32జిల్లాలలోని1600 గ్రామాల్లో సుమారు 400మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు,1000మంది విద్యార్థులు,సుమారు 600మంది వ్యవసాయశాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని సుమారు 2.50 లక్షల మంది రైతులని ప్రత్యక్షంగా కలిశారని వర్సిటీ ఉపకులపతి ప్రొ.అల్దాస్ జానయ్య తెలిపారు.తక్కువ యూరియా వాడి,సాగు ఖర్చు తగ్గించి,నేల ఆరోగ్యాన్ని కాపాడాలని,అవసరం మేరకే రసాయనాలని వాడాలని,పంట మార్పిడి విధానాలని అనుసరించాలని,మార్కెట్ లో గిరాకీ ఉన్న వరి రకాలనే సాగు చేయాలని,సాగు నీటిని ఆదా చేయాలని,సేంద్రియ సాగు పద్ధతులని పాటించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించి మానవ ఆరోగ్యాన్ని కాపాడాలనే అంశాలపై ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కలిపించారు. ఏప్రిల్ 27వ తేదీ నుంచి నేటి వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ స్థాయి ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లాలోని పదర గ్రామం రైతు వేదికలో ఈరైతు ముంగిట్లో శాస్త్రవేత్తల ముగింపు కార్యక్రమం జరిగింది.దీనికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, శాసన సభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ,లు పాల్గొన్నారు.వీరితో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సిహెచ్ విద్యాసాగర్,డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సిహెచ్ వేణుగోపాలరెడ్డిలతో పాటు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 13 షటర్ల రీ-టెండర్ ప్రక్రియ కోట్ల కుంభకోణం.?.

రీటెండర్ ఆలస్యం వెనుక ఎవరి ప్రయోజనాలు..

బిజెపి ఫైర్..



**రామాయంపేట,మే 23 (సూర్య రేఖ)** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 13షటర్ల వ్యవహారంపై మున్సిపల్ పాలకవర్గం వ్యవహరిస్తున్న తీరును భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.ఈ13షటర్ల రీ-టెండర్ ప్రక్రియను కావాలనే ఆలస్యం చేస్తూ, రామాయంపేట మున్సిపాలిటీకి రావాల్సిన మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల ఆదాయాన్ని అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు.ఈ వ్యవహారం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో త్వరలోనే ప్రజల ముందుకు తీసుకువస్తామని హెచ్చరించారు.ప్రస్తుతం ఆషటర్లకు మున్సిపాలిటీకి వచ్చే నెలవారీ అద్దె కేవలం రెండు వేల నుంచి ఐదు వేల రూపాయల మధ్య మాత్రమే ఉండగా,అదే లీజుదారులు వాటిని ఇతరులకు 20వేల నుంచి 30 వేల రూపాయల వరకు కిరాయికి ఇచ్చి భారీ లాభాలు పొందుతున్నారని తెలిపారు.దీనివల్ల మున్సిపాలిటీకి భారీ ఆర్థిక నష్టంజరుగుతోందన్నారు. ప్రస్తుతం లీజులో ఉన్నవారిలో ఎవరూ పేదవారు కాదని,వారంతా వ్యాపార ప్రయోజనాల కోసం షటర్లను ఇతరులకు అద్దెకు ఇచ్చి లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితి వల్ల మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల మున్సిపల్ పాలకవర్గం మరియు కమిషనర్ వెంటనే స్పందించి,రీ-టెండర్ ప్రక్రియను ప్రారంభించి రామాయంపేట ప్రజలకు రావాల్సిన మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చాలని డిమాండ్ చేశారు.లేదంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని దిగ్బంధం చేసి భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కేటాయింపును అడ్డుకుంటారా.?..

ఫ్యూచర్ సిటీపై హరీష్ రావు వ్యాఖ్యలు సరికాదు..

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



**నాంపల్లి,హైదరాబాద్,మే23( సూర్యరేఖ)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి,బీఆర్ఎస్ నేత హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు సహేతుకమైనది కాదని,అభివృద్ధి విషయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాబోయే ప్రభుత్వం బీఆర్ఎస్ అనీ, తాము అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీష్ రావు అనడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ,హరీష్ రావు వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు.ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని తాము స్వాగతిస్తున్నామని,అయితే ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవడం కోసమే హరీష్ రావు కుట్రపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులకు గత పదేళ్ళలో టీఆర్ఎస్,బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పని కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు,సివిల్ సర్వీసెస్ అధికారులకు,ప్రజాప్రతినిధులకు ఫ్యూచర్ సిటీలో 500ఎకరాల భూమి కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రస్తుత సమయంలో మాజీ మంత్రి హరీష్ రావు ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం పాత్రికేయుల్లో ఆవేదన,ఆందోళన వ్యక్తమవుతుందని ఆయన పేర్కొన్నారు.తమ రాజకీయ కక్షలు,స్వార్థ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష నేతలు ప్రజల అభివృద్ధిని,సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడం సరైంది కాదని,జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించబోయే ఫ్యూచర్ సిటీకి అడ్డుపడడం బీఆర్ఎస్ పార్టీ చేయబోయే పెద్ద తప్పిదమని అన్నారు.తొమ్మిదిన్నరేళ్ళు అధికారంలో ఉండి జర్నలిస్టులకు ఏమీ చేయని ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు జర్నలిస్టుల సంక్షేమానికి అడ్డురావడం సరైంది కాదని మామిడి సోమయ్య హితవు పలికారు.

## బక్రీద్ సందర్భంగా పారిశుద్ధ్య పనులు వేగవంతం..

కృతజ్ఞతలు తెలిపిన నాయకులు



**జల్ పల్లి,మే23(సూర్యరేఖ)**బక్రీద్ పండుగను పురస్కరించుకొని జల్ పల్లి సర్కిల్,64వ డివిజన్ పహాడీషరీఫ్ ఈద్గా మైదానంలో పారిశుధ్య పనులను సర్కిల్ అధికారులు వేగవంతం చేశారని,దీంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,స్థానిక మాజీ కౌన్సిలర్ పందెం కొండల్ యాదవ్,అంజుమన్ కమిటీ సదర్ అధ్యక్షులు సర్వర్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఈద్గా మైదానంలో జరుగుతున్న పారిశుధ్య పనులను వారు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బక్రీద్ పండగను పురస్కరించుకొని ఈద్గాల వద్ద జిహెచ్ఎంసి జల్ పల్లి సర్కిల్ అధికారులు ప్రత్యేక ఏర్పాటును చేస్తున్నారని, అలాగే ఈటిగాల వద్ద పారిశుద్ధ్య పనులు మరింత వేగవంతం చేసి,అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేస్తున్నందుకు సర్కిల్ డిప్యూటీ కమిషనర్, శానిటేషన్ మేనేజర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు,సిబ్బంది పాల్గొన్నారు

# చెన్నూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశం..






**మందమర్రి,మే23(సూర్యరేఖ)**చెన్నూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ కేంద్ర కార్యాలయంలో శనివారం కీలక సమావేశం నిర్వహించారు.చెన్నూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి,మాజీ శాసనసభ్యులు, మాజీ ప్రభుత్వ విప్ బాల్కసుమన్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా మాజీ ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్సీ,మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇంచార్జి నారదాసు లక్ష్మణ్ రావు హాజరయ్యారు.చెన్నూర్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇంచార్జి,మాజీ డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగన్న సమక్షంలో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు,మూడు మున్సిపాలిటీల నుంచి ఒక్కో మండలానికి ఐదుగురు,ఒక్కో మున్సిపాలిటీకి ఐదుగురు చొప్పున నియమితులైన సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో మాట్లాడిన డాక్టర్ బాల్కసుమన్, నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గం లోని 230పోలింగ్ బూత్‌లకు సంబంధించి మొత్తం 460మంది బూత్ కోఆర్డినేటర్లను నియమిస్తున్నట్లు వెల్లడించారు. వారికి జిల్లా పార్టీ కార్యాలయంలో డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.అలాగే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియను ప్రతి గ్రామంలో పకడ్బందీగా అమలు చేసి,ఓటర్ల నమోదు,తొలగింపుల అంశాలను సమగ్రంగా పర్యవేక్షించాలని పార్టీ నాయకులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని,పంటలను కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలు,ఆరు గ్యారంటీలు, డిక్లరేషన్లు అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డాక్టర్ రాజారమేష్,వేల్పుల రవి,జె.రవీందర్, మేడిపల్లి సంపత్,బండారి సూరిబాబు,కొంగల తిరుపతి రెడ్డి,చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు,టీబీజీకేఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు, చెరువుల రక్షణకు ప్రత్యేక చొరవ..

ఆక్రమణల నుంచి కాపాడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వినతి




**రాజేంద్రనగర్,మే23(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన చెరువులు,కుంటలు,ప్రభుత్వ భూములను రక్షించాలని నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్,హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కోరారు.ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బుద్ధ భవన్‌లోని హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించి ఆక్రమణల గురించి వివరించారు.ప్రభుత్వ భూములను అక్రమ ఆక్రమణల నుంచి కాపాడాలని,అలాగే నియోజకవర్గం లోని చెరువులు,కుంటలను సుందరీకరించాలని కోరినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...నియోజకవర్గంలోని విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలోని క్రింది ప్రాంతాల అభివృద్ధి,రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గంలోని చెరువులు,కుంటలు ఆక్రమణలకు గురికాకుండా సరిహద్దులను రక్షించాలన్నారు.నర్సాబాయికుంట సుందరీకరణ, మార్కం దేయనగర్‌లో గల నర్సాబాయికుంటను పర్యాటక ప్రాంతంగా సుందరీకరిం చాలన్నారు.అప్పాచెరువు గగన్ పహాడ్ రక్షణ,సుందరీకరణ చేయాలని అన్నారు.రాజేంద్రనగర్‌లోని పత్తికుంట చెరువు ప్రాంతాన్ని సుందరీకరించి ,ప్రజలకు ఆహ్లాదకరంగా మార్చాలన్నారు.ప్రభుత్వ భూములను ఆక్రమణలు చేయకుండా కాపాడి,భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా చూడాలని ఆయన కోరారు.ఎమ్మెల్యే వినతిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందించారు.నియోజకవర్గంలోని ప్రభుత్వ భూముల రక్షణకు,చెరువులు,కుంటలను సుందరీకరణకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని,ఆక్రమణలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

## డ్రైనేజీ లీకేజీ సమస్యకు పరిష్కారమెప్పుడు..?

నాలుగుసార్లు గెలిచినా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభివృద్ధి చేసింది సున్నా..

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో ఒరిగిందేమీ లేదు..

బీజేపీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి







**రాజేంద్రనగర్,మే23(సూర్యరేఖ)** గగన్‌పహాడ్ వైపు వెళ్లే ఓల్డ్ కర్నూల్ రోడ్ అండర్‌పాస్ వద్ద గత 16సంవత్సరాలుగా తీవ్రమైన డ్రైనేజ్ లీకేజ్ సమస్య కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి అన్నారు.2009లో ఈ అండర్‌పాస్ ప్రారంభమైనప్పటి నుండి ఈ సమస్య అలాగే ఉండిపోయినా,ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన దుయ్యబట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి రోజు డ్రైనేజ్ మురుగు నీరు జలపాతం లాగా ప్రధాన రహదారిపై పడుతూ ఉండటంతో తీవ్ర దుర్వాసన,దోమల పెరుగుదల,ప్రజల ఆరోగ్య సమస్యలు,ట్రాఫిక్ ఇబ్బందులు మరియు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు.వేలాది మంది ప్రజలు ప్రతిరోజూ ఈ ప్రధాన రహదారిని ఉపయోగిస్తున్నప్పటికీ ప్రభుత్వం,సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు.ఇది అత్యంత సిగ్గుచేటైన విషయమన్నారు.2009 నుండి ఇదే స్థానిక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఈ సమస్యను పరిష్కరించలేదన్నారు.ప్రతి రోజు ఈ అండర్‌పాస్ మీదుగా ప్రయాణించే ప్రజల ఇబ్బందులు స్థానిక ఎమ్మెల్యేకు కనిపించకపోవడం బాధాకరమన్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి నీటి నిల్వలు,జారిపడే ప్రమాదాలు,వాహనదారులకు ఇబ్బందులు,స్కూల్ పిల్లలు మరియు స్థానిక ప్రజలకు తీవ్ర కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. ఇంత ముఖ్యమైన రహదారిపై ఉన్న సమస్యను సంవత్సరాలుగా పరిష్కరించకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు .రాజేంద్రనగర్ ప్రజలు పనికిరాని ప్రభుత్వం,నిర్లక్ష్య నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. మున్సిపల్,జలమండలి,సంబంధిత శాఖలు వెంటనే స్పందించి తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.తక్షణ చర్యలు తీసుకోకపోతే స్థానిక ప్రజలు,వాహనదారులు పెద్ద ఎత్తున ఆందోళనలు,నిరసనలు చేపట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

## సరూర్ నగర్‌లో ఘనంగా యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్

పాల్గొన్న ప్రముఖులు




**రాజేంద్రనగర్,మే23(సూర్యరేఖ)**రంగారెడ్డి జిల్లా యువజన సేవలు,క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 99రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్–2026 ముగింపు కార్యక్రమం శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కప్–2025 పోటీలలో పతకాలు సాధించిన రంగారెడ్డి జిల్లా క్రీడాకారులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు.వ్యక్తిగత,జట్టు విభాగాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ వేడుకలో అభినందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్లారెడ్డి రామ్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మల్లఖంబ్ క్రీడలో బుద్వేల్ ఆదర్శ్ విద్యాలయకు చెందిన శాలిని కాంస్య పతకం సాధించగా, అత్యాపత్యా బాలుర జట్టు కూడా కాంస్య పతకాన్ని గెలుచుకొని జిల్లా గౌరవాన్ని నిలబెట్టాయి.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జిల్లా యువజన సేవలు,క్రీడల అధికారి స్వర్ణలత,రంగారెడ్డి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మనోహర్,కార్యదర్శి ఎం.ప్రభాకర్,ఉపాధ్యక్షుడు పి.పరమేష్,సీనియర్ క్రీడాకారులు నీలేష్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై పేలిన డీసీఎం వాహనం టైరు..

ఈ ప్రమాదంలో డ్రైవర్ తలకు తీవ్ర గాయాలు



**రాజేంద్రనగర్,మే23(సూర్యరేఖ)**ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్–17వద్ద ఇవాళ తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుం టోంది.శంషాబాద్ వైపు నుంచి నార్సింగి వైపు వెళ్తున్న డీసీఎం వాహనం టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపుతప్పి వాహనం పల్టీ కొట్టింది .ప్రమాద తీవ్రతకు డీసీఎంలో ఉన్న సామగ్రి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.ఈ ఘటనలో డ్రైవర్ అమర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి చికిత్స అందించారు.సమాచారం అందుకున్న ఔటర్ రింగ్ రోడ్ సిబ్బంది,రాజేంద్రనగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమితులైన అబ్దేషి సదాలక్ష్మికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్మానం..




**రాజేంద్రనగర్,మే23(సూర్యరేఖ)**నిరంతరం పేద,బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నరాజేంద్రనగర్ మహిళా నాయకురాలు,గ్రేస్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ కుమారి అబ్దేసి సదాలక్ష్మి సేవలు మరువలేనివని పలువురు ప్రముఖులు అభిప్రాయం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యుర్యాలిగా తెలంగాణ ప్రభుత్వంచే నీయమించబడ్డ రాజేంద్రనగర్ మహిళా నాయకురాలు,గ్రేస్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ కుమారి అబ్దేసి సదాలక్ష్మిని రాజేంద్రనగర్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వివిధ దళిత సంఘాల నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు.సన్మానించిన వారిలో వనం నర్సింహా మాదిగ,కోరని దయానంద్,పోయిల జీవన్ దాస్,పోతురాజు యాదయ్య మాదిగ,క్యాసారం శంకర్ రావు మాదిగ,గుంటి సురేష్ మాదిగ,దాసరి రమేష్,పచ్చ శ్రీనివాస్,పచ్చ నర్సింగ్ రావు,గోల్కొండ రాజు కుమార్, ఎడ్లకాడి సూర్యం,కాచూరి నర్సింగ్ రావు,గోల్కొండ లేవి రాజ్,మన్నె శేకర్, ఎడ్లకాడి చంద్ర శేకర్,నాగని సురేష్,కవ్వగూడెం జనార్దన్,గౌతమ్,బర్ల సుమన్,ఎడ్లకాడి అనిల్ కుమార్, రాము,గిరిబాబు,ఆనంద్,కెన్ని తదితరులు పాల్గొన్నారు.

## ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజల్లోనే ఎమ్మెల్యే రాందాస్ నాయక్

గేట్ కారేపల్లిలో వెయ్యి మంది మహిళలకు చీరల పంపిణీ..

విజేతలకు బహుమతుల ప్రదానం



**కారేపల్లి,మే23 (సూర్యరేఖ)** రాష్ట్రంలో పేదల ప్రభుత్వంగా కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తోందని,ప్రజల ప్రతి అవసరాన్ని తీర్చే దిశగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.శనివారం రాత్రి కారేపల్లి మండలం గేట్ కారేపల్లిలో గుడిపూడి తిరుమలరావు ఆధ్వర్యంలో వెయ్యి మంది మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గుడిపూడి వెంకటరావమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కారేపల్లి,కామేపల్లి మండల స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రోఫీలు,నగదు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ... మహిళల సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.మహిళలకు వడ్డీ లేని రుణాలు,ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రేషన్ కార్డుల జారీ,ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి పథకాలు మహిళల అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు.గత పదేళ్ల పాలనలో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని,ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తోందన్నారు.గతంలో రేషన్ బియ్యాన్ని అమ్ముకునే పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు సన్నబియ్యం పంపిణీతో ప్రతి పేద కుటుంబం నాణ్యమైన బియ్యం వినియోగిస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్,ఎల్లయ్య,రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల,నాయకులు అడ్డగూడ ఐలయ్య,నర్సింగ్ శ్రీనివాసరావు, పెద్దబోయిన ఉమాశంకర్,అనీఫ్,సామినేని తిరుపతయ్య, గుడిపూడి నర్సయ్య,జక్కుల కుమార్, పావని,వడ్డె అనంతరామయ్య,కడియాల సుధాకర్, సర్పంచ్లు మేదరి వీరప్రతాప్,అంగోత్ మాత్రు,ఈసం మోతీరస్వామి, బానోత్ హీరాలాల్,బానోత్ బాలు, వడ్డె సులోచన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభలో తగ్గనున్న బలం

**విజయవాడ :** ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల నుంచి ఖాళీ అవుతున్న 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ వెలువడింది. జూన్ 18న పోలింగ్ జరగనుంది. అయితే ఏపీ నుంచి ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలు కూటమికి ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. కూటమికి ఏకపక్ష బలం ఉండడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ ఛాన్స్ లేదు. ఈ నాలుగు పదవులను కూటమి పార్టీలు పంచుకోనున్నాయి. అయితే ఇప్పటివరకు రాజ్యసభలో ఏపీ నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యం ఉండేది. కానీ ఇప్పుడు ఆ పార్టీకి ముగ్గురు సభ్యుల బలం తగ్గనుంది. దీంతో నాలుగు స్థానాలు మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మిగలనన్నాయి. అదే టైంలో కూటమికి రాజ్యసభలో బలం ఏడింటికి చేరనుంది.ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం 11 మంది ఎంపీలు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 11 మంది సభ్యులతో బలీయమైన శక్తిగా ఉండేది.. 2024 సార్వత్రిక ఎన్నికల సమయానికి ఆ పార్టీ బలం 11 మంది రాజ్యసభ సభ్యులు. సంపూర్ణ బలంతో ఉన్న ఆ పార్టీకి అప్పట్లో ఉపశమనమే. రాష్ట్రంలో శాసనమండలి, కేంద్రంలో రాజ్యసభ ద్వారా రాజకీయం చేయదలచుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే ఏపీలో కూటమి వచ్చిన తర్వాత చాలామంది రాజ్యసభ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఓ నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామాకు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం ఏడుకు తగ్గిపోయింది. చివరకు పార్టీలో నెంబర్ 2 గా ఉన్న విజయసాయిరెడ్డి సైతం రాజీనామా చేశారు. మిగిలిన ఏడింటిలో ముగ్గురు సభ్యులు ఇప్పుడు పదవి విరమణ చేస్తున్నారు. దీంతో వైసిపి బలం నాలుగుకు పడిపోనుంది. అదే సమయంలో కూటమి బలం ఏడుకు చేరుకోనుంది.తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లో ఓడిపోయింది. 23 స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. దీంతో వైసిపి శాసనమండలితో పాటు రాజ్యసభలో మెజారిటీ పెంచుకుంటూ వచ్చింది. అదే రాజ్యసభ బలంతో బిజెపికి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అయితే ఇప్పుడు బిజెపికి రాజ్యసభలో సంపూర్ణ మెజారిటీ దక్కనుండగా.. ఏపీ నుంచి భర్తీ అయ్యే రాజ్యసభ సీట్లు కూటమి ఖాతాలో పడనున్నాయి. వైసిపి బలం తగ్గిపోయి కూటమి బలం పెరగనుంది. దీంతో జాతీయ స్థాయిలో సైతం వైసీపీ బలం తగ్గిపోతోంది. ఇది ఆ పార్టీకి కాస్త మైనస్.

## గోల్డ్ మైన్ తవ్వకాలకు అంతా సిద్ధం

**కర్నూలు :** కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభానికి సిద్ధమైంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వచ్చే నెల 27న జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభిస్తారని సమాచారం. ఈ నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర తాజాగా జొన్నగిరిలో పర్యటించారు. టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన జొన్నగిరితో పాటుగా అనంతపురం జిల్లా రామగిరిలోనూ గోల్డ్ మైన్స్ ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అక్కడ కూడా బంగారు ఉత్పత్తిని ప్రారంభించేందుకు అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.కర్నూలు జిల్లా జొన్నగిరి మండలంలో దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైన్ ప్రారంభానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. జూన్ నెలలో జొన్నగిరి గోల్డ్ మైన్స్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించారు. అయితే కర్నూలు జిల్లాలోనే కాకుండా రాయలసీమలోని మరో జిల్లాలో ఉన్న గోల్డ్ మైన్స్ పైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి పెట్టింది. అనంతపురం జిల్లా రామగిరిలో ఉన్న గోల్డ్ మైన్స్‌పైనా ఏపీ సర్కారు ఫోకస్ పెట్టింది. ఈ విషయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

## చలో హైదరాబాద్ కరపత్రాలు ఆవిష్కరణ..







**ఆదిలాబాద్,మే23(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలో లంబాడీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న "చలో ఇందిరాపార్క్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను లంబాడి హక్కుల పోరాట రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భారత్ చవాన్ శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవన్ లో శనివారం ఆవిష్కరణ చేశారు.ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో లంబాడీ సమాజం అనేక సామాజిక,ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు.గిరిజన హక్కుల పరిరక్షణ,విద్యా మరియు ఉపాధి అవకాశాల కల్పన,భూముల సమస్యల పరిష్కారం, యువతకు ఉద్యోగ అవకాశాలు, తండాలకు మౌలిక వసతులు కల్పించడం వంటి ప్రధాన డిమాండ్లతో ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లంబాడీల సమస్యలను పరిష్కరించాలని ,లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈనెల 26న జరిగే "చలో ఇందిరాపార్క్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లంబాడీ యువత, నాయకులు, ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు జాదవ్, కృష్ణనాయక్,ఆడే సురేష్ రాథోడ్,గంగాధర్ జాదవ్, ప్రవీణ్ కుమార్,చవాన్,అలేందర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడ బంగ్లా రామాలయంలో ఘనంగా హారతి కార్యక్రమం..

జై శ్రీరామ్,శ్రీమన్నారాయణ,గోవిందా గోవిందా నామస్మరణలతో మార్మోగిన ఆలయం..

ప్రతి శనివారం సాయంత్రం ప్రత్యేక హారతి కార్యక్రమం..

లాటరీ విధానంలో భక్తురాలికి సీతమ్మవారి ఆశీర్వాద చీరను అందజేసిన ఉల్లి శ్రీనివాస్ దంపతులు..





**మరిపెడ,మే23(సూర్యరేఖ)**మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి వారి దేవాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన హారతి కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.ఆలయ అర్చకులు సుదర్శన్ బట్టార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహాహారతి సమర్పించారు.అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి హారతి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి దివ్య ఆశీర్వాదాలను పొందారు .అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం మొత్తం జై శ్రీరామ్..జై శ్రీమన్నారాయణ,గోవిందా గోవిందా నామస్మరణలతో మారుమోగింది.ఆలయ కమిటీ కార్యదర్శి,సెక్రెటరీ ఉల్లి శ్రీనివాస్ దంపతులు భక్తులలో ఐక్యత,ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు మూడు శనివారాలు లాటరీ పద్ధతిలో భక్తురాలిని ఎంపిక చేసి సీతమ్మవారి ఆశీర్వాద చీర అందజేస్తామని తెలిపారు.ఇందులో భాగంగా ఈ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో లాటరీ ద్వారా ఎంపికైన వెంపటి సుజాతకుసీతమ్మవారి ఆశీర్వాద చీరను,తోట చైతన్యకు అమ్మవారి జాకెట్ ను ఉల్లి శ్రీనివాస్ దంపతులు ఆలయ అర్చకులు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా అర్చకులు,ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ..ప్రతి శనివారం సాయంత్రం 7గంటల నుండి 7:30 గంటల వరకు ఆలయంలో హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.భక్తి,ఐక్యత,ఆధ్యాత్మికత పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.భక్తుల ఐక్యత,ఆధ్యాత్మికత పెంపొందించడం కోసం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ఆడబిడ్డ వివాహానికి సర్పంచ్ కానుక

రూ.10 వేల చెక్కు అందజేత



**అందోల్,మే23(సూర్యరేఖ):** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ హస్నాబాద్ గ్రామానికి చెందిన పీచరాగడి నాగమణి మల్లేశం కుమార్తె లక్ష్మి వివాహాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ తులసి తన వంతుగా ఆర్థిక సాయం చేశారు.అందులో భాగంగా రూ.10 వేల చెక్కును వివాహ కానుకగా అందించి తమ వంతుగా వివాహానికి ఆసరాగా నిలిచారు.ఈ మేరకు నాగమణి కుటుంబ సభ్యులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ..ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం తనకెంతో సంతోషాన్ని ఇస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భారతమ్మ,పంచాయత్ కార్యదర్శి అనిల్,వార్డ్ మెంబర్ నర్సింలు,గ్రామ యువకులు సాలె పాండు,ముదిరాజ్ సంఘం యువనాయకుడు అంజిముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిన్న జన్మదిన వేడుకలు



**అందోల్,మే23(సూర్యరేఖ):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పిచ్చేరాగాడి చిన్న జన్మదిన వేడుకలు ఘనంగా స్నేహితులతో కలిసి నిర్వహించుకున్నారు.అందులో భాగంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో అల్గోల్ వార్డు మెంబర్ డాష్ డైనమిక్ బిఆర్ఎస్ యువనాయకుడు స్వామిదాస్,పౌల్ట్రీ ఫాం యజమాని విశాల్,గురుజ్వాడా వార్డు మెంబర్ బిఆర్ఎస్ యువనాయకుడు పవులు,పిచ్చేరాగాడి నితిన్ అభిమానులు స్నేహితులు భారీ సంఖ్యలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## సింగరేణి మండలంలో పర్యటించిన బానోత్ మనీషా లక్ష్మి..

నిరంతరం సేవ చేయడమే ఏకైక లక్ష్యమని స్పష్టం



**కారేపల్లి,మే23(సూర్యరేఖ):**వైరా నియోజకవర్గ ప్రజల సేవలోనే తన జీవితం అంకితమని బానోతు మనిషా లక్ష్మి అన్నారు.వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నట్లు వివరించారు.కారేపల్లిలో కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మ తల్లి గుడిలో పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం జడల వెంకటేశ్వర్లు గృహంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పాల్గొన్నారు.మనిషా లక్ష్మి మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వం నమోదు అన్ని బూతులో అన్ని గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరిగి చేయాలి అని సూచించారు.అనంతరం వైరా నియోజకవర్గంలో అతి త్వరలో అన్ని గ్రామంలో ప్రజల బాగోగులను అడిగి తెలుసుకుంటాను ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా,కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నిరంతరం సేవ చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మాజీ సర్పంచ్ లు,మాజీ ఉపసర్పంచ్ లు,వార్డ్ మెంబర్లు,గ్రామ శాఖ అధ్యక్షులు మదన్ లాల్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మృణాల్, పూజా హెగ్డేలతో వరుణ్ ధావన్ రొమాన్స్.. 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' ట్రైలర్ విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్, స్టార్ హీరోయిన్లు మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ప్రముఖ సీనియర్ దర్శకుడు, వరుణ్ ధావన్ తండ్రి డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్ ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ చిత్ర ట్రైలర్ ఆసక్తికరమైన కోర్టు సీన్‌తో మొదలవుతుంది. వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ భార్యాభర్తలుగా నటిస్తుండగా, వరుణ్‌కు పిల్లలు కావాలని, కానీ మృణాల్ దానికి సిద్ధంగా లేకపోవడంతో వారు విడాకుల కోసం కోర్టు మెట్లెక్కుతారు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లిన వరుణ్ ధావన్, అక్కడ పూజా హెగ్డేను కలుసుకుని ప్రేమలో పడతాడు. అయితే ఊహించని విధంగా అటు మృణాల్ ఠాకూర్, ఇటు పూజా హెగ్డే ఇద్దరూ ఒకేసారి ప్రెగ్నెంట్ కావడంతో కథలో పెద్ద ట్విస్ట్ వస్తుంది. ఇలా ఇద్దరు మహిళల మధ్య ఇరుక్కుపోయిన వరుణ్ ధావన్, ఆ నిజం బయటపడకుండా మేనేజ్ చేస్తూ ఎలాంటి అబద్ధాలు ఆడాడు, ఎలాంటి గందరగోళ పరిస్థితులను ఎదుర్కొన్నాడు అనేది ఈ సినిమా కథాంశం. ఇక ట్రైలర్‌తోనే మొత్తం కథను చెప్పేశాడు దర్శకుడు. వరుణ్, మృణాల్, పూజాలతో పాటు మనీష్ పాల్, చంకీ పాండే, జిమ్మీ షెర్గిల్, మౌని రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాత రమేష్ తౌరానీ నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# 'విక్రమ్' సినిమాతో మొదలైన ప్రయాణం..


## 40 ఏళ్ల మైలురాయిని దాటిన 'కింగ్'!

తెలుగు సినీ దిగ్గజం అక్కినేని నాగార్జున సినీ ప్రస్థానానికి నేటితో సరిగ్గా నలభై ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియా వేదికగా భావోద్వేగభరితమైన పోస్ట్ షేర్ చేశారు. తన జీవితంలో మే 23వ తేదీ ఎప్పటికీ మర్చిపోలేని అత్యంత ప్రత్యేకమైన రోజు అని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా 40 ఏళ్ల క్రితం, అంటే 1986 మే 23న నాగార్జున హీరోగా పరిచయమైన తొలి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. బాలీవుడ్ సూపర్ హిట్ 'హీరో' చిత్రానికి రీమేక్‌గా దర్శకుడు మధుసూధనరావు తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించి, నాగార్జునకు భారీగా అభిమానులను సంపాదించి పెట్టింది. నాటి నుంచి నేటి వరకు ప్రేక్షకులు, అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమాభిమానాలే తనను ఇండస్ట్రీలో ఇంతకాలం నడిపించాయని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేవలం తొలి చిత్రమే కాకుండా, తన కుటుంబానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన 'మనం' సినిమా కూడా ఇదే రోజున విడుదల కావడం విశేషమని నాగార్జున గుర్తుచేసుకున్నారు. తన తండ్రి, దివంగత నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు గారి చివరి చిత్రమైన 'మనం' 2014 మే 23న విడుదలైంది. ఒకే స్క్రీన్‌పై నాన్నతో కలిసి, అలాగే తన కుమారులు నాగచైతన్య, అఖిల్‌లతో కలిసి నటించే అరుదైన అదృష్టం ఈ సినిమాతోనే దక్కిందని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. భవిష్యత్తులో కూడా మరిన్ని మే 23లను అభిమానుల మధ్య ఇలాగే ఘనంగా జరుపుకోవాలని ఆశిస్తున్నట్లు కింగ్ నాగార్జున ఆకాంక్షించారు. ఈ మైలురాయిని దాటిన నాగార్జున ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఈ సినిమాలో నాగార్జున పలు విభిన్నమైన గెటప్పులలో కనిపించబోతున్నట్లు సమాచారం. గతంలో నాగార్జున కెరీర్‌లో ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచిన 'శివ', 'రక్షకుడు', మరియు 'కూలీ' చిత్రంలోని స్టైలిష్ సైమన్ వంటి పాత్రలను గుర్తుకు తెచ్చేలా ఈ 100వ సినిమా సరికొత్త హంగులతో ఉండబోతోందని దర్శకుడు ఇటీవల వెల్లడించారు. నాలుగు దశాబ్దాలుగా వెండితెరపై అలరిస్తూ, సరికొత్త ప్రయోగాలతో దూసుకుపోతున్న కింగ్ నాగార్జునకు సినీ ప్రముఖులు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



# మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్'గా వాసంతి జంట.. తట్టుకోలేకపోయిన నటరాజ్ మాస్టర్!

పక్కవారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని చాలా మందికి ఆశ.. అందులోనూ సెలబ్రిటీలు రియల్ లైఫ్‌లో ఎలా ఉంటారో చూడాలని చాలామంది తహతహలాడుతుంటారు. వారందరి కోసమే ఎప్పటికప్పుడు కొత్త కొత్త రియాలిటీ షోలు పుట్టుకొస్తున్నాయి. అలా ఎక్కువమందికి దగ్గరైన షో బిగ్‌బాస్. ఈసారి కొత్తగా 'మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్' అనే షో తీసుకొచ్చారు. ఇది మాటీవీతో పాటు హాట్‌స్టార్‌లోనూ ప్రసారమైంది.




**10 వారాల రియాలిటీ షో**

శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ షోలో అనిల్ రావిపూడి, రాధ, లయ జడ్జిలుగా వ్యవహరించారు. సీరియల్స్, బిగ్‌బాస్ ద్వారా ఫేమస్ అయిన సెలబ్రిటీలను కంటెస్టెంట్లుగా ఎంచుకున్నారు. అలా 10 సెలబ్రిటీ జంటలను 10 వారాలపాటు ఒక మాన్షన్‌లో ఉంచారు. వారే మహేశ్- సాండ్రా, జాను- భాను, వాసంతి కృష్ణన్- పవన్ కల్యాణ్, నటరాజ్ మాస్టర్- నీతూ, నూకరాజు- ఆసియా, సంధ్య- బ్రిట్టో, హరిత- హరీశ్, ప్రియాంక జైన్- శివకుమార్, అంజలి - పవన్, సోనియా- సిద్ధు.

**విజేతగా వాసంతి జోడీ**

మధ్యలో అభిమానిక- ఆమిర్ దంపతులు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చారు. ఈ జంటల మధ్య ప్రేమ, నమ్మకం, సహనాన్ని పరీక్షించారు. ఎన్నో గేమ్స్ ఆడించారు. వాటన్నింటినీ దాటుకుని అందరికంటే బలమైన జంటగా నిలిచారు వాసంతి కృష్ణన్- పవన్ కల్యాణ్. ఈ జోడీ మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్ ట్రోఫీ గెలవడంతో పాటు రూ.15 లక్షల ప్రైజ్‌మనీ అందుకుంది. రెండో స్థానంలో నూకరాజు, మూడో స్థానంలో మహేశ్, ఐదో స్థానంలో జాను దంపతులు నిలిచారు. మొదటి నుంచి గెలుపు నాదే అని ఫిక్సయిన నటరాజ్ మాస్టర్ నాలుగో స్థానానికి పరిమితమవడంతో హర్టయి ఫినాలే నుంచి వెళ్లిపోయాడు.

# బికినీ ఫొటోలపై 'డ్రాగన్' హీరోయిన్ ఆగ్రహం

కన్నడ హీరోయిన్ రుక్మిణి వసంత్ పేరు చెప్పగానే సంప్రదాయ పాత్రలే గుర్తొస్తాయి. అలాంటిది ఈమె స్విమ్మింగ్ పూల్‌లో బికినీ ధరించి ఫొటోషూట్ చేసిందని చెప్పి ఓ వీడియోతో పాటు కొన్ని ఫొటోలు వైరల్ అయ్యాయి. నిజంగానే రుక్మిణి ఇలా చేసిందా అని అంతా అనుకున్నారు. ఇప్పుడు సదరు బికినీ పిక్స్‌పై ?స్వయంగా రుక్మిణినే క్లారిటీ ఇచ్చింది. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. 'ఏఐ సాయంతో సృష్టించిన నా ఫొటోలు ఆన్‌లైన్‌లో వైరల్ కావడం నేను, నా టీమ్ గుర్తించాం. అవన్నీ ఫేక్. ఏఐతో తయారు చేశారని క్లారిటీ ఇస్తున్నాను. ఇలాంటివి క్రియేట్ చేయడం నిజంగా బాధ్యతారాహిత్యమే. అలానే మా వ్యక్తిగత గోప్యతని ఉల్లంఘించడమే అవుతుంది. దీన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నాను. ఫొటోలని సృష్టించిన వాళ్లతో పాటు, సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వారిపై సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు మొదలుపెట్టాం. ఇలాంటి వాటిని పోస్ట్ చేయడం, షేర్ చేయడం లాంటివి మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని రుక్మిణి చెప్పుకొచ్చింది. రీసెంట్ టైంలో ఇలా జరగడం మరీ ఎక్కువైపోయింది. గతంలో పలువురు ఫొటోగ్రాఫర్లు.. వెనక వైపు నుంచి, అసభ్యకర యాంగిల్స్‌లో ఫొటోలు తీస్తున్నారని రుక్మిణితో పాటు పలువురు కన్నడ హీరోయిన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడిలా జరిగింది. యాంకర్ అనసూయకి కూడా ఇలానే జరగడంతో కేసు పెట్టింది. రుక్మిణి సినిమాల విషయానికొస్తే.. కన్నడలో చేసిన 'సప్త సాగర ఎల్లో దాచే' రెండు భాగాలతో పాటు 'కాంతార' సీక్వెల్ ఈమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ప్రస్తుతం ఎన్టీఆర్‌తో 'డ్రాగన్'లో నటిస్తోంది. వచ్చే ఏడాది జూన్ 11న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది.



Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713